

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు




పల్నాడు జిల్లాలో అతిసారంపై

## జిల్లా కలెక్టర్‌కు సీఎం ఫోన్

4

# రాజధానికి రైల్వే లైన్

- ఏపీకి శుభవార్త ప్రకటించిన కేంద్రం
- అమరావతికి కొత్త రైల్వే లైను ఆమోదం
- ప్రాజెక్టు వివరాలు వెల్లడించిన మంత్రి వైష్ణవ్
- మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్‌గా పరిటాల
- రాజధానులతో రాజధాని అనుసంధానం: చంద్రబాబు
- ఏపీకి ఇది చారిత్రక రోజు: కేంద్రమంత్రి కింజరాపు
- అభివృద్ధికి ఇది క్రియాశీలకం: డిప్యూటీ సీఎం

2 లో



## హైవేలపై.. ప్రగతి పరుగు!



- నేషనల్ హైవే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- హాజరైన అధికారులు, వివిధ ప్రాజెక్టుల ఏజెన్సీ ప్రతినిధులు
- 129 హైవే ప్రాజెక్టులు.. 3,300 కి.మీ.మేర పనులు..
- మొత్తంగా రూ.76 వేల కోట్ల పనులు జరుగుతున్నాయన్న అధికార్లు
- ప్రాజెక్టులవారీగా పనుల పురోగతిని సమీక్షించిన ముఖ్యమంత్రి
- భూసేకరణ, అటవీ అనుమతులు రాక.. పనులు ఆలస్యం
- ఎన్‌హెచ్ పనుల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్
- విభాగాల మధ్య సమన్వయ సాధనకు పోర్టల్ ఏర్పాటు చర్యలు
- భూసేకరణను మూడు నెలల్లో పరిష్కరించాలన్న సీఎం చంద్రబాబు

2 లో

## అర్హులందరికీ పరిహారం

- ప్రతి దరఖాస్తూ పరిశీలించాలని ఆదేశం
- ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదు..
- అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు
- వరద సాయం తీరుతెన్నులపై చంద్రబాబు సమీక్ష

6

## ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించండి

- ఎన్ విడియా సీఇఓ జెన్సన్ హువాంగ్‌కు మంత్రి లోకేష్ వినతి
- ప్రపంచ ప్రఖ్యాత ఏఐ కంప్యూటింగ్ సంస్థ ఎన్ విడియా
- సంస్థ సీఈఓతో ముంబయిలో మంత్రి లోకేష్ భేటీ



- వివరాలు 5 లో..

## ఏపీలో 10 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు

- ప్రణాళికలతో సెరెంటికా గ్లోబల్ సిద్ధం
- మంత్రి లోకేష్‌కు తెలిపిన సంస్థ ప్రతినిధులు

- వివరాలు 4 లో..



7

## వైసీపీ నేతల భూకబ్జాలకు అధికారుల అండ

- పోలీసులు తొత్తులుగా మారి సహకరించారు
- బాధితులపైనే ఎదురుకేసులు పెట్టి వేధించారు
- పెద్దిరెడ్డి అండతో భూములు కొట్టేసిన కజిన్ బ్రదర్
- దివ్యాంగుల స్థలాలు కొట్టేసి వ్యభిచారం నిర్వహణ
- న్యాయం చేయాలని ప్రజావేదికకు అర్జీదారులు

## లేని దిశ చట్టం గురించి జగన్‌రెడ్డి గాలిమాటలు



- నిప్పులాంటి లోకేష్‌పై తుప్పు జగన్ విమర్శలు హాస్యాస్పదం
- దిశ చట్టంపై లోకేష్ సవాల్‌కు తోకముడిచిన పిరికిపంద
- నిద్రలో సైతం లోకేష్ పేరునే కలవరిస్తున్నాడు
- మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం

- వివరాలు 4 లో..

## లోకేష్ కాలిగోటికి కూడా జగన్‌రెడ్డి సరిపోడు



- అవాకులు, చవాకులు పేలడం సిగ్గుచేటు
- గత ఐదేళ్లలో 2 లక్షల మంది మహిళలపై అఘాయిత్యాలు
- ఒక్క రోజు కూడా జగన్ నోరు తెరవలేదు
- నేడు దోషులను కఠినంగా శిక్షిస్తున్నాం
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సారథ్యంలోనే రాష్ట్రాభివృద్ధి
- మంత్రి మండిపల్లి ఉద్ఘాటన

5

## థాంక్స్.. మోదీజీ

- అమరావతి రైల్వేలైన్ ఆమోదంపై సీఎం రెస్పాన్స్
- మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తికి చంద్రబాబు వినతి
- కృష్ణాపై ఐకానిక్ రైల్వే బిడ్జి నిర్మించాలన్న సీఎం
- రాష్ట్రంలో.. ఇకపై స్పీడ్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కూడా..
- గత ఐదేళ్లూ తప్పుడు కేసులకే ప్రాధాన్యత...
- ఇప్పుడు మేం మంచి చేస్తుంటే తప్పుడు ప్రచారాలు
- తల్లీ, చెల్లిని రోడ్డుకు లాగిన వ్యక్తి.. మాపై నిందలా
- అలాంటివాళ్లతో రాజకీయాలు చేయాల్సి వస్తుందనుకోలేదు
- జగన్ దాచిన చీకటి జీవోలను బయటపెడతాం
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు

3

చైతన్యరథం

# హైవేలపై.. ప్రగతి పరుగు!

- నేషనల్ హైవే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- హాజరైన అధికారులు, వివిధ ప్రాజెక్టుల ఏజెన్సీ ప్రతినిధులు
- 129 హైవే ప్రాజెక్టులు.. 3,300 కి.మీ.మేర పనులు..
- మొత్తంగా రూ.76 వేల కోట్ల పనులు జరుగుతున్నాయన్న అధికార్లు
- ప్రాజెక్టులవారీగా పనుల పురోగతిని సమీక్షించిన ముఖ్యమంత్రి
- భూసేకరణ, అటవీ అనుమతులు రాక.. పనులు ఆలస్యం
- ఎన్‌హెచ్ పనుల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్
- విభాగాల మధ్య సమన్వయ సాధనకు పోర్టల్ ఏర్పాటు చర్యలు
- భూసేకరణను మూడు నెలల్లో పరిష్కరించాలన్న సీఎం చంద్రబాబు



అమరావతి, అక్టోబరు 24: అత్యుత్తమ మౌలికసదుపాయాలతో ప్రగతి పరుగులకు మార్గం సుగమమయ్యేలా హైవే ప్రాజెక్టు వేగంగా సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అందుకు హైవే అథారిటీ అధికారులు, నిర్మాణ సంస్థలు కాలంతో పరుగులు తీయాలని చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. స్వర్ణచతుర్భుజి రహదారుల తరువాత దేశంలో వచ్చిన మార్పులను గమనించి ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. మౌలికసదుపాయాల కల్పనే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నేషనల్ హైవే ప్రాజెక్టుల పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సమీక్షించారు. రాష్ట్ర, నేషనల్ హైవే అధికారులు, వివిధ ప్రాజెక్టుల పనులు నిర్వహిస్తోన్న ఏజెన్సీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం 129 నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు జరుగుతుంటే.. 3,300 కి.మీ మేర రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం రూ.76,000 కోట్ల ఎన్‌హెచ్ పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఇవికాకుండా రానున్న రోజుల్లో మరో రూ.30వేల కోట్ల కొత్త ప్రాజెక్టులు కూడా చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. సమీక్షలో ఆయా పనులప్రస్తుత పరిస్థితి, నిర్దేశిత లక్ష్యం, పనులు జరుగుతున్న తీరు, పరిష్కరించాల్సిన సమస్యలపై చర్చించారు. ప్రాజెక్టులు మంజూరైనా భూసేకరణ పూర్తికాకపోవడంతో 260కి.మీ మేర రూ.4,766 కోట్ల విలువైన 11ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు ముఖ్యమంత్రి చంద్ర బాబు దృష్టికి తెచ్చారు. ఫారెస్ట్ క్లియరెన్స్‌లు, భూసేకరణ, కోర్టు కేసుల కారణంగా ప్రాజెక్టుల పనులు ప్రారంభం కాలేదన్నారు. బెంగుళూరు-కడప- విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే 9వ ప్యాకేజీలో 7.5కి.మీ నిర్మాణానికి సంబంధించి అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. కడప-చిన్న ఓరంపాడు మధ్య రూ.1,222కోట్లతో నిర్మిస్తున్న 64.2కి.మీ రోడ్డు, చిన్న ఓరంపాడు-రేణిగుంట మధ్య రూ.1,032కోట్లతో నిర్మిస్తున్న 57కి.మీ రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఇలా మొత్తం 260 కి.మీ. మేర నేషనల్ హైవేలకు సంబంధించి కోర్టుకేసులు, భూసమీకరణ, పరిహారం, స్టేటస్ కో ఆర్డర్స్ కారణంగా పనులు పెండింగులో ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే, సమస్యలను మూడు నెలల్లో పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. పనులు నిర్వహిస్తోన్న వివిధ సంస్థల ప్రతినిధులు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో అన్నిశాఖల మధ్య సమన్వయంతో పనులు వేగంగా పూర్తి చేయడానికి ఒక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. 9మందితో నేషనల్ హైవే, ఫారెస్టు, రైల్వే, రెవెన్యూ, రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు సీఎం తెలిపారు. దీంతోపాటు అన్ని విభాగాలతో కలిపి ఒక పోర్టల్ ఏర్పాటుచేసి సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చే ప్రత్యేక పోర్టల్ ద్వారా ఇలాంటి సమస్యలకు సత్వర పరిష్కారం చూపగలిగితే.. హైవే ప్రాజెక్టుల పనులువేగవంతం చేస్తామని అధికారులు వివరించారు. కాంట్రాక్టర్లు హైవేలలో నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఉచితంగా తీసుకెళ్ళొచ్చని సీఎం సూచించారు. అదేవిధంగా హైవే ప్రాజెక్టుల్లో అవసరమైన గ్రావెల్ కోసం నిర్మాణ సంస్థలకు అవసరమైన అనుమతులు సులభంగా వచ్చేలా చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. అయితే అనుకున్న లక్ష్యం మేరకు ఎవరు పనులు చేయకపోయినా సమీక్షించి తగుచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. వేగంగా హైవే ప్రాజెక్టులు పూర్తి చేయడం తమ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని సీఎం అన్నారు. ప్రతి మూడు నెలలకు పనులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. కేంద్రం చేపట్టిన భారత మాల ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో 3 ప్రాజెక్టులు 6లేన్ల రోడ్లతో ఉన్నాయి. రాయపూర్-విశాఖపట్నం, చిత్తూరు-తచ్చూరు, బెంగళూరు- కడపకు 6 లేన్ల రోడ్ల నిర్మాణం జరుగుతోంది. మొత్తంగా 518 కి.మీమేర రాష్ట్రంలో 6లేన్ల రహదారుల నిర్మాణం జరుగుతోంది. అలాగే 4లేన్ల పనులు జరుగుతున్న ప్రాజెక్టులు 4ఉన్నాయి. బెంగళూరు- చెన్నై, హైదరాబాద్- విశాఖపట్నం, సోలాపూర్- కర్నూలు- చెన్నై, నాగపూర్- విజయవాడ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని అధికారులు వివరించారు. రూ.26,000 కోట్లతో 189 కి.మీ విస్తీర్ణంలో అమరావతి అవుటర్ రింగ్‌రోడ్, రూ.300 కోట్లతో 56 కి.మీ మేర కుప్పం-హొసూరు- బెంగుళూరు నాలుగు లైన్లరోడ్, మూలపేట నుంచి విశాఖ వరకు రూ. 8,300 కోట్లతో 165 కి.మీ మేర 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ కోస్టర్ హైవే, హైదరాబాద్-విజయవాడ మధ్య 226 కి.మీ రోడ్డును రూ.8 వేల కోట్లతో 4 లైన్ల నుంచి 6 లేదా 8 లేన్లుగా పెంచే ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. నేషనల్ హైవే రోడ్ల ప్రాజెక్టులలో బ్రిడ్జిలు నిర్మించే స్ట్రక్చర్లకు గేట్లు పెట్టడం ద్వారా నీటిని నిల్వఉంచే అవకాశాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇలా చెక్‌డ్యాం తరహాలో నీటిని నిల్వ చేస్తే గ్రౌండ్ వాటర్ పెరగడంతో పాటు.. ఆ ప్రాంత నీటి అవసరాలు తీరుతాయని... ఈ విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మళ్లీ మూడు నెలల తరువాత ఆయా ప్రాజెక్టులపై సమీక్షచేసి ప్రోగ్రెస్‌ను లెక్కిస్తామని సీఎం అధికారులకు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులకు తెలిపారు.

# రాజధానికి రైల్వే లైన్

- ఏపీకి శుభవార్త ప్రకటించిన కేంద్రం
- అమరావతికి కొత్త రైల్వే లైను ఆమోదం
- ప్రాజెక్టు వివరాలు వెల్లడించిన మంత్రి వైష్ణవ్
- మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్‌గా పరిటాల
- రాజధానులతో రాజధాని అనుసంధానం: చంద్రబాబు
- ఏపీకి ఇది చారిత్రక రోజు: కేంద్రమంత్రి కింజరాపు
- అభివృద్ధికి ఇది క్రియాశీలకం: డిప్యూటీ సీఎం



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.2,245 కోట్లతో అమరావతికి 57కి.మీ మేర కొత్త రైల్వే లైన్ మంజూరు చేస్తున్నట్టు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్టు మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. రూ.2,245కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై సహా దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో రాజధాని అమరావతిని కలుపుతూ కొత్త రైల్వే ప్రాజెక్టు చేపట్టనున్నట్టు మంత్రి వెల్లడించారు.ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నదిపై 3.2కి.మీ పొడవైన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఏపీలో కొత్త రైల్వేలైన్ అమరావతి మీదుగా ఎర్రుపాలెం నుంచి నంబూరు మధ్య ఏర్పాటు కానుంది. ఈ రైల్వేలైన్‌తో దక్షిణ, మధ్య, ఉత్తర భారత్‌తో అమరావతి అనుసంధానం సులువుకానుంది. అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలు, అమరలింగేశ్వర స్వామి ఆలయం, ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు వెళ్లేవారికి సులువైన మార్గంగా అభివృద్ధి చేయనున్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను అనుసంధానిస్తూ ఈ రైల్వేలైన్ ఏర్పాటుకానుంది. ఈ రైల్వే ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు.

దేశంలోని ప్రధాన నగరాలు, రాజధాని ప్రాంతాలతో అమరావతి కనెక్టివిటీ లైన్ ప్రకటించిన అనంతరం -కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్..రాష్ట్ర ముఖ్యమంతి చంద్రబాబుతో కలిసి వర్చ్యువల్ మీడియా సమావేశం నిర్వహించారు.ఆ సమావేశంలో డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కల్యాణ్, విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధ్రీశ్వరి, ఏపీ ఎంపీలు పాల్గొన్నారు. వర్చ్యువల్ మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కొత్త రైల్వేలైన్ ఏర్పాటుతో అమరావతి దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం కానుందన్నారు. విశాఖ రైల్వేజోన్ అంశం దీర్ఘకాలంగా పెండింగులో ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులు, ముఖ్యంగా అమరావతి కనెక్టివిటీ లైన్‌కు సంబంధించి భూసేకరణ సహా ఇతర అంశాల్లో రాష్ట్ర సహకారం రైల్వే శాఖకు సంపూర్ణంగా అందిస్తామని సీఎం స్పష్టం చేశారు. అయితే, కొత్త రైల్వే లైన్ పనులను సాధ్యమైనంత త్వరగా.. అంటే మూడేళ్లలో పూర్తి చేయగలిగితే రాష్ట్రానికి ఎంతో లాభదాయకమన్నారు. అలాగే, రాజధాని అమరావతిని అత్యద్భుత ప్రాంతంగా తీర్చిదిద్దుతున్న నేపథ్యంలో.. నగరానికి అందం తెచ్చేలా కృష్ణా నదిపై నిర్మించే రైల్వే వంతెనను ఐకానిక్ బ్రిడ్జిగా నిర్మించాలని రైల్వే మంత్రి దృష్టికి తెచ్చారు. వర్చ్యువల్ మీట్‌లో కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ఇది చారిత్రక రోజుగా అభివర్ణించారు. ఎన్డీయే ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. రాజధాని నుంచి ఏ ప్రాంతానికైనా అనుసంధానం చాలా కీలకమన్నారు. పది రోజుల స్వల్ప వ్యవధిలోనే కొత్త రైల్వే లైన్ ప్రతిపాదనలు కేబినెట్ ముందుకు తెచ్చి.. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాష్ట్ర ప్రజల హృదయాలను చూరగొన్నారన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అభివృద్ధికి... పారిశ్రామిక, ఉపాధి కల్పనకు కొత్త రైలు మార్గం బాటలు వేయగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రానికి ధన్యవాదాలు చెబుతూ.. రాజధానికి వచ్చే ప్రజలు, అధికారులు, ఉద్యోగులకే కాదు అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలు, అమరలింగేశ్వర స్వామి ఆలయం, ధ్యానబుద్ధ ప్రాజెక్టు సందర్శనకు వచ్చేవారికి రైల్వే లైన్ అనువుగా ఉంటుందన్నారు. వాణిజ్యపరంగా, వ్యాపారపరంగా కూడా రైలుమార్గం కచ్చితంగా రాష్ట్రాభివృద్ధికి క్రియాశీలకంగా మారబోతోందన్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులకు కొత్త రైలు మార్గం అనుసంధానమయ్యేలా ఉంటుంది కాబట్టి ఈ రైలు మార్గం వెంబడి పారిశ్రామిక పురోగతి జరుగుతుందన్నారు. దీనికి మంత్రి అశ్వినీ వైష్ణవ్ సంతోషం వ్యక్తం చేస్తూ.. ఈ ప్రాజెక్టుతో మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్‌గా పరిటాల మారనుందన్నారు. పరిటాల వద్ద మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ వస్తుందన్నారు. ఏపీలో 73 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని వివరించారు. "160 కి.మీ వేగంతో వెళ్లేలా సెమీ హైస్పీడ్ రైల్వేలైన్ల నిర్మాణం, మొత్తం మూడు కారిడార్లను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు వెల్లడించారు. అలాగే, అమరావతి- హైదరాబాద్, అమరావతి- చెన్నై కారిడార్ల అభివృద్ధి, అమరావతి బెంగళూరు కారిడార్ అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ప్రకటించారు. రైల్వే లైన్ ద్వారా అమరావతికి ప్రత్యక్ష అనుసంధానం ఉంటుందన్నారు. పరిశ్రమల స్థాపన, ప్రజా రవాణాకు మెరుగైన వ్యవస్థలా ఉంటుందని, బహుళ ట్రాకింగ్ సులభతరంతో పాటు రద్దీని తగ్గిస్తుందని వివరించారు.

### రణస్థలం వద్ద ఎలివేటెడ్ కారిడార్: కేంద్రం.. రూ.252.42 కోట్లు మంజూరు

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర రూ.252.42 కోట్లు మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద ఆరువరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కారిడార్ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసిందంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# థాంక్స్.. మోదీజీ

- అమరావతి రైల్వేలైన్ ఆమోదంపై సీఎం రెస్పాన్స్
- మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తికి చంద్రబాబు వినతి
- కృష్ణాపై ఐకానిక్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలన్న సీఎం
- రాష్ట్రంలో.. ఇకపై స్పీడ్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కూడా..
- గత ఐదేళ్లూ తప్పుడు కేసులకే ప్రాధాన్యత...
- ఇప్పుడు మేం మంచి చేస్తుంటే తప్పుడు ప్రచారాలు
- తల్లీ, చెల్లిని రోడ్డుకు లాగిన వ్యక్తి.. మాపై నిందలా
- అలాంటివాళ్లతో రాజకీయాలు చేయాల్సి వస్తుందనుకోలేదు
- జగన్ దాచిన చీకటి జీవోలను బయటపెడతాం
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు




అమరావతి (చైతన్య రథం): అమరావతి రైల్వేలైనుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాజధానికి రైల్వే కనెక్టివిటీ వల్ల దేశంలోని అన్ని రాజధానులతో అమరావతిని అనుసంధానించే వీలు కలిగిందన్నారు. గురువారం సీఎం చంద్రబాబు వర్చ్యువల్ మీట్‌లో కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్, కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎంపీ పురంధ్వేరితో మాట్లాడారు. 'అమరావతి రైల్వేలైన్‌కు ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రిమండలికి ధన్యవాదాలు. అమరావతికి ఈ రైల్వే లైను వేయడం వల్ల దేశంలోని అన్ని రాజధాని నగరాలతూ అనుసంధానమవుతుంది. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కలకత్తా నగరాలను ఈ రైల్వే ప్రాజెక్టు కలుపుతుంది. రూ.2,245 కోట్లతో 57 కి.మీ.మేర చేపట్టనున్న ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తిచేస్తే మరింత ఉపయోగకరం. కృష్ణానదిపై నిర్మించే 3.2 కిమీ రైల్వే వంతెనను ఐకానిక్ బ్రిడ్జిగా మార్చాలని కోరుతున్నా. దేశంలోనే అమరావతి వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు బెస్ట్ సిటీగా ఉంటుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం వివిధ మార్గాల్లో సాయం అందిస్తోందని, ఈ లైను నిర్మాణంలో భాగంగా 25 లక్షల చెట్లను నాటడం ద్వారా కార్బన్ డై ఆక్సైడ్ నివారించవచ్చని అన్నారు. రాష్ట్రంలో రూ.72 వేల కోట్ల విలువైన రైల్వేప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, ఎప్పటినుండో పెండింగులోవున్న రైల్వే జోన్ సమస్యనూ పరిష్కరించుకున్నామన్నారు. వచ్చే నెల లేదా డిసెంబరులో మంచి ముహూర్తం చూసి రైల్వేజోన్‌కు ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయిస్తామని వెల్లడించారు. ఇతర రైల్వే స్టేషన్లలో కూడా ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. రాష్ట్రం నుండి ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ కూడా తగిన సమయంలోనే అందిస్తాం. 10 రోజుల క్రితమే ఢిల్లీలో పర్యటించినప్పుడు అమరావతి రైల్వే కనెక్టివిటీ గురించి ప్రధాని మోదీతో మాట్లాడాను...ఇంత తక్కువ సమయంలో కేబినెట్ ఆమోదించడం సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం' అని అన్నారు.

### గత ఐదేళ్లు ముందుకు సాగని ప్రాజెక్టులు

'రణస్థలం-శ్రీకాకుళం రహదారిని ఆరు లేన్లుగా మార్చుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం సంతోషం. 199 ప్రాజెక్టులు రాష్ట్రంలో ఉన్నాయి. ఆర్ అండ్ బి, సీఎల్ఆర్, అటవీ శాఖతో సమస్యల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. 8,744 కి.మీ మేర జాతీయ రహదారులూ ఉన్నాయి.
ఇందులో కొత్తగా 3,300 కి.మీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలో 6 లేన్ల రహదారులు తక్కువగాఉన్నాయి. 8 లేన్ల రహదారులు కూడా రావాల్సి ఉంది. భూసేకరణ, అటవీ, పర్యావరణ క్లియరెన్స్ లేకపోవడంతో కొన్ని ప్రాజెక్టులు నిలిచిపోయాయి. పనులు ప్రారంభించని ప్రాజెక్టులు 3 ఉన్నాయి. భూ సమస్యతో 70, అటవీ శాఖ అనుమతిలేక 20, టోల్ ప్లాజా సమస్యతో 2 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈవిధంగా సుమారు 95 ప్రాజెక్టులు ఆగిపోయి ఉన్నాయని, 3నెలల్లో ఈ సమస్యలన్నీ పరిష్కరించేలా అధికారులకు టార్గెట్ ఇచ్చామన్నారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తాయి... పనులు తీసుకున్న ఏజన్సీలు నిర్దీత సమయంలో పనులు పూర్తి చేయాలి. 636 కి.మీ గ్రీన్ ఫీల్డ్ రోడ్లు కుప్పం-హోసూరు, హైదరాబాద్-మచిలీపట్నం, మూలపేట-విశాఖపట్నం నిర్మాణంపై చర్చించాం. అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. నేషనల్ హైవేలతో పాటు రాష్ట్ర హైవేలను పూర్తి చేస్తే పోర్టుకు కనెక్టివిటీ పెరుగుతుంది. రాష్ట్రం గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారే అవకాశం ఉంది. ఆక్వా, హార్టికల్చర్ ఎగుమతులకు ఎక్కువ అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో అన్ని ప్రాజెక్టులు ముందుకు సాగలేదు. ఏపీకి ఉండే కనెక్టివిటీపై అశ్రద్ధ పెట్టారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. దీనికి అనుగుణంగా వేగంగా నిర్మాణాలు జరగాలి. లాజిస్టిక్ కాస్ట్‌ను తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు వివరించారు.

### సామాన్యులకు మరింత సులువుగా అందుబాటులో ఇసుక

'సామాన్యులు, నిర్మాణదారులకు ఇసుక అందుబాటులో ఉంచాలని నిర్ణయించాం. గతంలో బినామీలను పెట్టుకుని ఇసుకను దారి మళ్లించారు. ప్రకృతి సంపదను దోచేశారు. ఇసుక సరఫరా లేకపోవడంతో 30లక్షల మంది భవనిర్మాణ కార్మికులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలో 108 కొత్త ఇసుక రీచ్‌లకు అనుమతి ఇస్తున్నాం. గత ఐదేళ్లలో గాడితప్పిన పనులను గాడిన పెడుతున్నాం. పెండింగ్ పనులన్నీ జరిగితే ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం అవుతాయి. గత ఐదేళ్లు తప్పుడు కేసులకే ప్రాధాన్యమిచ్చారు. మేం మంచి చేస్తుంటే చూసి భరించలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అమరావతి- అనంతపురం హైవే అలైన్‌మెంట్‌ను మార్చేశారు. అమరావతి - కడప, గిద్దలూరు-అమరావతి పనులు పూర్తిచేశాక భవిష్యత్తులో ఇంకా ఏంచేయాలో ఆలోచిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేసేది లేదని, రాష్ట్రాన్ని విధ్వంసం చేసేది ఉండదని అంటూ.. గత వైసీపీ పాలనను చమత్కరించారు. 'విధ్వంసం మొదలెడితే ముగింపుండదు. అమరావతి, పోలవరంను నిర్వీర్యం చేయడంతో ఆర్థికభారం పడింది. రాష్ట్రంలోని 93 శాతం మేర ప్రాజెక్టులు నీళ్లతో నిండి ఉన్నాయి. నదులు అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు నీరిస్తాం. త్వరలో వాటర్ పాలసీ తీసుకొస్తాం. ఒకప్పుడు కరవుతో రాష్ట్రం ఇబ్బంది పడేది. దేశంలోనే రాయలసీమను ఎకనమిక్ జోన్‌గా మార్చాం. విజయవాడలో జరిగిన డ్రోన్ సమ్మిట్ గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకురానున్నాం. దీనికి సంబంధించి మంత్రి లోకేష్ అన్ని చర్యలు తీసుకుంటున్నారు' అని చంద్రబాబు వివరించారు.

## తల్లీ, చెల్లిని రోడ్డుకు లాగి మమ్మల్ని నిందిస్తున్నాడు

'ప్రస్తుతం ఏపీ అభివృద్ధి గురించి ప్రజలంతా మంచిగా మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో గతంలో జరిగిన విధ్వంసం గురించి మాట్లాడుకున్నారు. చీకటి జీవోలతో పాలన సాగించారు. ప్రభుత్వం పాలన అందించేటప్పుడు పారదర్శకత ఉండాలి. ఐదేళ్ల చీకటి జీవోలపై విచారణ చేయిస్తున్నాం. గత పాలకుల అరాచకాలన్నీ బయటకు వస్తున్నాయి. తల్లి, చెల్లితో గొడవలు పెట్టుకుని వాటిలోకి మమ్మల్ని లాగుతున్నారు. తండ్రి సంపాదించిన ఆస్తి తల్లికి రానివ్వకుండా చేస్తున్నాడు. తల్లి, చెల్లికి ఇవ్వాల్సిన ఆస్తిపై కండీషన్ పెడతారా ఎవరైనా.? 2004లో జగన్ ఆదాయం ఎంత? ఇన్ని లక్షల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?' అని చంద్రబాబు నిలదీశారు. 'దీపావళి నుండి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించబోతున్నామని, కేంద్రం అమరావతికి డబ్బులిస్తామంటే వద్దన్నారు. ప్రజావేదిక కూల్చారు...నేను తలచకుంటే ఇప్పుడు కూల్చడాలు చేయలేనా.? అమరావతిని ఎడారిగా చేశారు. భూములిచ్చిన రైతుల ఇళ్లపై డ్రోన్లు ఎగరేశారు. తప్పుడు పనులు చేసి పరదాలు కట్టుకు తిరిగారు. ఇటువంటి వ్యక్తితో రాజకీయ చేస్తానని అనుకోలేదు. ఎంతోమందితో సిద్ధాంతపరంగా, అభివృద్ధిపరంగా పోరాటం చేశాను. చిల్లరకంటే హీనమైన రాజకీయాలు జగన్ చేశారు. రోడ్లు మొత్తం గుంతలు పెట్టారు. 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పేరబెట్టారు. చెత్త పన్ను కట్టలేదని ఇంటిముందు చెత్తవేశారు. ఆ పార్టీలో ఉండేవారు కూడా పార్టీ పేరు చెప్పుకోవడానికి కూడా సిగ్గు పడాలి. విలువల్లేని మనుషులతో సమాజానికి చేటు. చెత్తటీవీ, చెత్త పేపరులో నోటికొచ్చింది రాసుకున్నారు. గత ఐదేళ్లు నన్ను బయటకు రానివ్వలేదు. కానీ మేం జగన్ ను తిరగనిస్తున్నాం. అమరావతిలో పర్యటించిన సమయంలో నాపై రాళ్లు వేయించారు... ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కుందని నాటి డీజీపీ అన్నారు. ఇప్పటి అధికారులకు నేను అలా చెప్పడం లేదు. తెనాలి అత్యాచారం కేసులో నిందితుడి తల్లే చెప్తోంది... వైసీపీలో చేరి తన కొడుకు చెడిపోయాడని. బంధువుల మధ్యే నేరం జరిగిందని చెప్తుంటే దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారు' అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పల్నాడు జిల్లాలో అతిసారంపై జిల్లా కలెక్టర్‌కు సీఎం ఫోన్



అమరావతి (చైతన్య రథం): పల్నాడు జిల్లా దాచేపల్లిలో అతిసారంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారనే సమాచారంపై కలెక్టర్‌తో మాట్లాడి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దాచేపల్లిలో పరిస్థితి, ప్రభుత్వపరంగా తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా సీఎంకు కలెక్టర్ వివరించారు. ఆ ప్రాంతంలో సాధారణ స్థితి వచ్చేంత వరకు నిత్యం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని... వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేయాలని సీఎం ఆదేశించారు.

## దాచేపల్లి పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్ష

- పల్నాడు కలెక్టర్‌కు మంత్రి సత్యకుమార్ ఆదేశం



అంజనాపురం కాలనీలో వైద్యశిబిరం

అమరావతి (చైతన్యరథం): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలం అంజనాపురం కాలనీలో డయేరియా కేసులు నమోదవుతున్నాయని తెలియడంతో అధికారులను అప్రమత్తం చేసి, వెంటనే పల్నాడు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. అలాగే కుటుంబ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ డాక్టర్ సిరి, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరిని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించామన్నారు. గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి బాధితులకు సాయం అందించాలని సూచించాను. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని,వ్యక్తిగత పరిశుభ్రత, కాచిచల్లార్చిన నీటిని తీసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరాను. బాధితులకు ప్రభుత్వం తరపున అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తాం. ప్రజలు కూడా వ్యక్తిగత శుభ్రత పాటించాలని మంత్రి సత్యకుమార్ కోరారు.

## ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయండి

- పరిస్థితి చక్కబడేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- దాచేపల్లిలో డయేరియాపై మంత్రి నారాయణ సమీక్ష



అమరావతి (చైతన్యరథం): పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం అంజనాపురం కాలనీలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి పొంగూరు నారాయణ సమీక్షించారు.జిల్లా అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి నారాయణ పరిస్థితిని సమీక్షించారు. నీరు కలుషితం కావడం కారణంగా మరణించారా.. లేక వేరే కారణాలున్నాయా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని మంత్రికి అధికారులు తెలిపారు. స్థానికంగా ఉన్న బోర్ల నీటిని విజయవాడ ల్యాబు పరీక్షల కోసం పంపాలని మంత్రి ఆదేశించారు. అన్ని బోర్లను మూసివేసి వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. ఇద్దరు మృతి చెందడంతోపాటు మరో ఆరుగురు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతోపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వివరించారు.

డ్రైనేజీల్లో మురుగును తొలగించడంతోపాటు అన్ని మంచి నీటి బోర్లను తనిఖీ చేయాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. అవసరమైతే ఇతర మున్సిపాలిటీల నుంచి సిబ్బందిని రప్పించాలన్నారు. సాధారణ పరిస్థితి వచ్చేవరకు మున్సిపల్, వైద్యారోగ్యశాఖ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు,జేసీ సూరజ్, అర్డీఎంఏ హరికృష్ణ, డీఎంహెచ్ వో రవికుమార్,పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్,నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు సమీక్షలో పాల్గొన్నారు.

# ఏపీలో 10 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు

- ప్రణాళికలతో సెరెంటికా గ్లోబల్ సిద్ధం
- మంత్రి లోకేష్‌కు తెలిపిన సంస్థ ప్రతినిధులు



ముంబయి (చైతన్యరథం): వేదాంత గ్రూప్ అనుబంధ సంస్థ సెరెంటికా గ్లోబల్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబయిలోని సంస్థ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్‌లో 10 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల నిర్మాణానికి తమ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 2030 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తిచేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్యసాధన కోసం సెరెంటికా గ్లోబల్ వంటి కార్పొరేట్లు, ఇన్వెస్టర్లకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. రాష్ట్రంలో పెద్దఎత్తున రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా యువతకు పెద్దసంఖ్యలో ఉద్యోగాలు కల్పించాలని తాము భావిస్తున్నట్లు మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# లేని దిశ చట్టం గురించి జగన్‌రెడ్డి గాలిమాటలు

- నిప్పులాంటి లోకేష్‌పై తుప్పు జగన్ విమర్శలు హాస్యాస్పదం
- దిశ చట్టంపై లోకేష్ సవాల్‌కు తోకముడిచిన పిరికిపంద
- నిద్రలో సైతం లోకేష్ పేరునే కలవరిస్తున్నాడు
- మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం



విజయవాడ (చైతన్యరథం): ఉనికిలోనే లేని దిశ చట్టాన్ని ఉన్నట్టు చూపుతూ అసత్యాలు, అబద్దాలతో పాలన సాగించిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు బుద్ధి, జ్ఞానం, దిశ చట్టం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తండ్రి పేరును నిలబెట్టే వ్యక్తి నారా లోకేష్ అయితే.. తండ్రికి అంతోఇంతో ఉన్న పేరును చెడగొట్టే వ్యక్తి జగన్‌రెడ్డి అని దుయ్య బట్టారు. విజయవాడలోని తన క్యాంప్ కార్యాల యంలో మంత్రి నిమ్మల గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బుద్ధి, జ్ఞానం, దిశ చట్టం గురించి జగన్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్ప దంగా ఉందన్నారు. ప్రపంచంలోనే బుద్ధి, జ్ఞానం లేనటువంటి వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి. గత ఐదేళ్ల పాలనలో దిశ చట్టమనేది ఉంటే సుమారు రెండు లక్షలకు పైగా అఘాయిత్యాలు ఎందుకు జరిగాయి? ఐదేళ్ల పాలనలో దిశ చట్టం ప్రకారం ఒక్కరికైనా ఎందుకు శిక్ష వేయించలేదు? దిశ చట్టం లేదు కాబట్టే ఒక్కరికి కూడా ఆ చట్టం ప్రకారం శిక్ష పడలేదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

### లోకేష్ సవాల్‌కు బదులేది?

మంత్రి లోకేష్ నిప్పులాంటి వ్యక్తి కనుకే.. నిద్రలో సైతం జగన్‌రెడ్డి పదే పదే ఆయన పేరు కలువరిస్తున్నారు. లోకేష్ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలో చదువుకోవడమే కాకుండా.. ప్రపంచ బ్యాంక్‌లో ఉద్యోగం చేసినటువంటి వ్యక్తి. గతంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా రాష్ట్రంలో 25వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించిన ఘనత లోకేష్‌కే దక్కింది. ఐటీ మంత్రిగా తక్కువ కాలంలోనే 30వేల ఉద్యోగాలు కల్పించడంలోనే లోకేష్ ప్రతిభ ప్రజలకు తెలిసింది. దిశ చట్టం పేరుతో జగన్‌రెడ్డి ప్రజలను మభ్య పెట్టారు. విద్యార్హతలు కూడా చెప్పుకోలేని వ్యక్తి జగన్. పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోలేని తుప్పు జగన్‌రెడ్డి. తుప్పు లాంటి వ్యక్తి నిప్పులాంటి వ్యక్తి లోకేష్‌ని విమర్శిస్తే ఎవరూ సహించరు. నిజంగా దిశ చట్టమనేది వైసీపీ పాలనలో ఉంటే చర్చకురావాలని లోకేష్ సవాల్ విసిరితే తాడేపల్లి కొంపదాటి జగన్‌రెడ్డి బయట కురాలేకపోయాడు. దీన్ని బట్టే గత ఐదేళ్లలో దిశ చట్టం లేదని తేలిపోయిందని మంత్రి నిమ్మల అన్నారు.

### అందరి మనసులు గెలుచుకుంటున్న లోకేష్

లోకేష్ నిప్పులాంటి వ్యక్తి కాబట్టే ఆయన పాదయాత్రకు అడుగడుగునా జగన్‌రెడ్డి అడ్డంకులు సృష్టించాడు. జగన్‌రెడ్డి తప్పుడు పనులు చేశాడు కాబట్టే ప్రజల్లోకి ధైర్యంగా రాలేకపోయాడు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి పరదాలు, బారికేడ్లు, 144 సెక్షన్, 30 యాక్ట్, ముందస్తు అరెస్టుల మాటున ప్రజల్లోకి వచ్చిన దుస్థితిని ప్రజలుమరచిపోలేదు.జగన్‌రెడ్డి బుద్ధి, జ్ఞానం లేనటువంటి వ్యక్తి గనుకే తల్లి, చెల్లిని పీడిస్తున్నాడు. జగన్‌రెడ్డి తుప్పు కాబట్టే ఆయన సీఎం స్థానంలో ఉండగా లులూ, కియా అనుబంధ పరిశ్రమలు, జాకీ, అమర్‌రాజా వంటి పరిశ్రమలు రాష్ట్రం నుంచి తరలిపోయాయి. మంత్రి లోకేష్ నిప్పుగనుకే రాష్ట్రానికి మళ్లీ పరిశ్రమలను రప్పిస్తున్నారు. నందమూరి తారక రామారావు మనవడిగా, నందమూరి బాలకృష్ణ అల్లుడిగా, సీఎం చంద్రబాబునాయుడు కొడుకుగా మాత్రమే కాకుండా స్వశక్తితో ఎదగాలనే ఆలోచనతో ప్రజల కష్టసుఖాల్లో భాగం పంచుకుంటున్నారు. విద్యాశాఖ మంత్రిగా ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థి దగ్గర నుంచి అత్యున్నతమైన బోధన చేసే ఉపాధ్యాయుల వరకూ అందరి మనసులను గెలుచుకున్న వ్యక్తి లోకేష్ అని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

# అమరావతి నిర్మాణానికి రెండు నెలల్లో టెండర్లు

- మంత్రి నారాయణ వెల్లడి
- అమరావతి రైల్వేలైనుకు కేంద్రం ఆమోదంపై హర్షం

అమరావతి (చైతన్యరథం): అమరావతి రైల్వే లైనుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపటం పట్ల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు.గత టీడీపీ ప్రభుత్వహయాంలో 2017 నవంబరు 13న ఈ ప్రాజెక్టుపై కేంద్రానికి ప్రతిపాదించామన్నారు. గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడి ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పడేసిందని విమర్శించారు. ఈ ప్రాజెక్ట్‌కు ఇప్పుడు కేంద్రం ఆమోదం తెలపటం అమరావతి అభివృద్ధిలో కీలక పరిణామమన్నారు. అమరావతికి సంబంధించి న్యాయపరమైన అంశాలు ఒకొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. జగన్ వల్ల అమరావతి రైతులుపడినన్ని కష్టాలు ఇంకెవరూ పడలేదు. అందుకే రైతుల సమస్యలపైనే ముందుగా దృష్టి సారించాం. అమరావతి నిర్మాణానికి సంబంధించి గతంలో కుదుర్చుకున్న కాంట్రాక్టులన్నీ మరో పదిహేను రోజుల్లో రద్దు చేసి కొత్తటెండర్లు పిలుస్తామని మంత్రి నారాయణ తెలిపారు. 360కిమీ ట్రంక్ రోడ్లు, లేఅవుట్లు, కొండవీటి,పాలవాగు, గ్రావిటీ కెనాల్, కరకట్ట రోడ్డుకు నవంబర్ మొదటి వారం నుంచి డిసెంబర్ చివరిలోగా అన్ని పనులకూ టెండర్లు పూర్తి చేస్తామన్నారు. సెక్రటేరియట్ భవనాల నిర్మాణానికి డిసెంబర్ నెలాఖరులో టెండర్లు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణానికి జనవరి నెలాఖరుకు టెండర్లు పూర్తి చేస్తాం.

# అర్హులందరికీ పరిహారం



- ప్రతి దరఖాస్తూ పరిశీలించాలని ఆదేశం
- ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదు..
- అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబ
- వరద సాయం తీరుతెన్నులపై చంద్రబాబు సమీక్ష

అమరావతి (చైతన్య రథం): విజయవాడ వరద బాధితులకు ప్రభుత్వం అందించినసాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో గురువారం సమీక్షించారు. వరదలు తగ్గిన 15రోజుల్లోనే ప్రభుత్వం 4,19,528 మందికి పరిహారం అందించింది. ఇప్పటి వరకు మొత్తం రూ.618 కోట్ల పరిహారం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమచేశామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ముందుగా రూ.602 కోట్లు జదిలీ చేశామని... తరువాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించి దాదాపు 9 వేలమందికి మరో రూ.16 కోట్లు చెల్లించామని అధికారులు తెలిపారు. తరువాత కూడా చాలా మంది పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నారని.. వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నామన్నారు.మళ్లీ కొత్తగా 2,954దరఖాస్తులు రాగా... పరిశీలనలో 1,646 దరఖాస్తులు అర్హత కలిగినవిగా గుర్తించా మని.. మిగిలిన వాటిలో 1052 దరఖాస్తులు అర్హత లేనివిగా తేల్చామన్నారు. అర్హత కలిగిన 1,646 మందిలో 850మందికి గురువారం బ్యాంక్ అకౌంట్ల లో పరిహారం జమ చేశామన్నారు. మిగిలిన 796 మందికి శుక్రవారం వారి అకౌంట్లలో పరిహారం జమ చేస్తామని వివరించారు. అకౌంట్ల వివరాల్లో తప్పులు, ఇతర సాంకేతిక సమస్యలు పరిష్కరించి ప్రతి ఒక్కరికీ సాయం అందేలా చూడాలని అధికారులను సీఎం ఆదే శించారు. పరిహారానికై వచ్చే ప్రతి దరఖాస్తూ పరిశీలిం చాలని, అర్హులుంటే తప్పకుండా సాయం అందేలా చూడాలన్నారు. సచివాలయాల్లో లబ్ధిదారుల వివరాలు పూర్తిగా ప్రదర్శించాలని సీఎం సూచించారు. ఒకవేళ ఎవరైనా పరిహారం పొందడానికి అనర్హులుంటే, ఆ విషయాన్నీ వారికి స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. మొత్తం 2954దరఖాస్తుదారుల వివరాలను సచివాలయంలో,వెబ్‌సైట్‌లో ఉండాలని సీఎం ఆదేశించారు.వీరితోపాటు మొదటి ఫేజ్‌లో పరిహారం పొందిన 4,19,528 మంది పేర్లు కూడా ఆయా సచివాలయాల్లో ప్రదర్శించాలని సీఎం సూచించారు. బీమా విషయంలో తీసుకున్న చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటి వరకు 85 శాతం బీమా ప్రక్రియ పూర్తైందని, మిగిలిన 15 శాతం కూడా పూర్తి చేస్తామన్నారు. బీమా కంపెనీలతో చర్చించేందుకు శుక్రవారం సమా వేశం ఏర్పాటు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా, ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సాయం చేసిందని... ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఏ ఒక్క అర్హునికీ సాయం అందకుండా ఉండకూడదని... అందుకే ఇప్పటికీ ఈ అంశంపై తాను సమీక్షలు చేస్తున్నానని సీఎం అన్నారు. అతి పెద్ద విపత్తును అత్యంత సమర్ధవంతంగా ఎదుర్కొన్న ప్రభుత్వం.. ఒకరిద్దరికి సాయం విషయంలో వెనకడుగు వేసేది లేదని చెప్పారు. అర్హతవున్న మిగిలిన అందరికీ సాయం అందుతుందని.. బాధిత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## జగన్‌రెడ్డి క్రూరత్వంతో

# తల్లి, చెల్లి కూడా భయపడుతున్నారు

- కేసుల విషయంలో తండ్రిని కూడా ఇరికించిన ఘనుడు
- ఆయన సంపాదించిన ఆస్తి మొత్తం అక్రమమే..ప్రజల ఆస్తి
- అక్రమాస్తుల్లో దేశంలోనే ఆయన రెండో స్థానంలో ఉన్నారు
- సరస్వతీ పవర్‌కు 2009లో భూములను వైఎస్ కట్టబెట్టారు
- ప్రారంభించని పరిశ్రమకు లీజు ఎందుకు పొడిగించాడో చెప్పాలి
- జైలు భయం పట్టుకుని కాంగ్రెస్‌తో మంతనాలు జరుపుతున్నారు
- మాజీ ముఖ్యమంత్రి పదానికే విలువ లేకుండా చేశాడు
- భూకేటాయింపులను రద్దు చేసి ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి
- మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మంగళగిరి(చైతన్యరథం): జగన్‌ను మాజీ ముఖ్యమంత్రి అని పిలవటానికి కూడా అర్హుడు కాదు, ఆ పదానికి విలువ లేకుండా చేశాడని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌ది అతిక్రూర మనస్తత్వంతో భయపడి తల్లి విజయమ్మ, చెల్లి షర్మిళ దూరంగా ఉంటున్నారన్నారు. ఓట్ల కోసం నా తల్లి, నా తండ్రి, నా చెల్లి, నా అక్క అంటాడు.. అవసరం తీరిపోయాక ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తాడు. ఇంట్లో తల్లి, చెల్లితో ఆస్తుల విషయంలో ఒక అంగీకారంతో నిర్ణయం తీసుకుని మాట మార్చిన వ్యక్తి జగన్ నేడు ఎన్‌సీఎల్‌టీకి ఫిర్యాదు చేయడం ఆయన క్రూరత్వానికి నిదర్శనమన్నారు. తల్లిని, చెల్లిని రాజకీయంగా సరెండర్ కావాలంటున్నాడు..రాజకీయాలకు,ఆస్తులకు సంబంధం లేదు.. కోట్ల సంపద ఉన్నా తల్లికి, చెల్లికి ఇవ్వడానికి మనసు రాకపోవడం ఆయన ధనదాహానికి నిదర్శనమని పేర్కొన్నారు. జగన్ వద్ద ఉన్న ఆస్తి అంతా అక్రమమే..ప్రజల ఆస్తి.. సరస్వతి పవర్ కంపెనీకి వైఎస్ 2009లో 600 హెక్టార్లకు పైగా క్వారీలను కట్టబెట్టాడని గుర్తుచేశారు. సరస్వతి పవర్ అనే కంపెనీని పెట్టాలని బోర్డు రిజల్యూషన్ రాకముందే వైఎస్ ప్రభుత్వం భూ కేటాయింపులు చేసిందన్నారు. అయితే 2015వరకు కూడా భారతి సిమెంట్స్ ఫ్యాక్టరీ పనులను ప్రారంభించలేదని తెలిపారు. చట్ట ప్రకారం పరిశ్రమకు ప్రభుత్వం భూమి కేటాయిస్తే రెండేళ్లలో పని మొదలుపెట్టాలి.. అవస రమైతే ఆరు నెలలు పొడిగిస్తారు.. అంతకు మించి గడువివ్వరు. అయితే రాజశేఖర్‌రెడ్డి హయాంలో భూమి కేటాయించి ఆరేళ్లు గడిచినా పరిశ్రమ ఏర్పాటు చేయలేదు కానీ జగన్ తాను సీఎంగా ఉండగా ఈ భూముల మీద లీజును 30ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పొడిగించుకున్నాడని వివరించారు. ఈ కంపెనీలకు సంబంధించిన కేసుల విషయంలో మాత్రం సీబీఐ, ఈడీ, సుప్రీంకోర్టు దాకా వెళ్లడంతో ఇది నాకు సంబంధమే లేదంటూ తండ్రి రాజ శేఖర్‌రెడ్డినే కేసులో ఇరికించిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. జగన్ నిర్వాకం వల్లే రాజశేఖర్‌రెడ్డి సీబీఐ, ఈడీ కేసుల్లో ముద్దాయి అయ్యాడు. జగన్ క్రూర మనస్తత్వానికి ఇవే నిదర్శన మన్నారు.



### శవాలతో రాజకీయం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

ఆటో కుదవ పెట్టి మా చెల్లి పెళ్లి చేశానని కొందరు పేదలు చెప్పుకుంటుంటారు. అక్క చెల్లెళ్ల పట్ల అలాంటి ప్రేమ చూపిస్తారు తప్ప తల్లి, చెల్లికే నోటీసులు ఇప్పించాడంటే జగన్ మామూలోడు కాదు. దేశంలో ప్రజల ఆస్తులను సొంతానికి కూడగట్టుకున్న వారిలో జగన్‌రెడ్డి రెండవ స్థానంలో ఉన్నాడు. తల్లి, చెల్లిని బ్లాక్ మెయిల్ చేయడం పబలుకాదు. చిన్నాన్ననే పొట్టన పెట్టుకున్న కిరాతకుడు. తల్లి ఆవేదన అర్థంకాని వ్యక్తి జగన్. మంచి కొడుకు అని అనుకుని మోసపోయామని తల్లే అనడం ఎక్కడైనా ఉంటుందా? శవాలతో రాజకీయం చేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య. చిన్నాన్న విషయంతో అది నిర్ధారణ అయిందని గుర్తుచేశారు. ప్రజలను మోసం చేయొద్దు, శవాల వద్దకు రావద్దని జనం ఛీ కొడుతున్నా ఆయనకు బుద్ధి రావడం లేదు. బెంగళూరుప్యాలెస్‌లో కూర్చొని జగన్ కాంగ్రెస్‌తో మంతనాలు జరుపుతున్నారని బయటికొచ్చింది. కేంద్రం ఎక్కడ కన్నెర్రచేసి తనను జైల్లోపెట్టిస్తుందో అనే భయం కూడా జగన్‌ను వెంటాడుతుంది. నాటకాల రాయుడు జగన్‌రెడ్డి కాంగ్రెస్‌తో తనకు విభేదాలున్నాయని నాటక మాడుతున్నాడు. 2009నుంచి 2015 వరకు ప్రారంభించని పరిశ్రమకు భూముల లీజును 30 ఏళ్ల నుంచి 50ఏళ్లకు ఎందుకు పెంచుకున్నాడో జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. ఆరేళ్ల పాటు ప్రారంభం కాని పరిశ్రమకు ప్రభుత్వ సొమ్ము ఎందుకు ధారాదత్తం చేయాలి? ఎందుకు భూ కేటాయింపులను రద్దు చేయకూడదో చెప్పాలి. సరస్వతీ పవర్‌ను మూడు భాగాలు చేయాలి. ఒక భాగం జగన్‌కు,ఒక భాగం షర్మిలకు తల్లికి, ఒక భాగం గ్రామస్థులకి ఇవ్వాలి. సరస్వతి భూములు పేదలవి. దానికి ఆయన ఎన్‌సీఎల్‌టీకి ఫిర్యాదు చేయడమేంటి? ఏ తల్లి అయినా తన బిడ్డలను సమా నంగా చూస్తుంది. కానీ జగన్ చేష్టలకు విజయమ్మ భరించలేక కొడుకును కాదని కూతురు వైపు మొగ్గు చూపింది. జగన్ దుర్మార్గాల గురించి వాసిరెడ్డి పద్మ స్వయంగా చెప్పారు. అనేక మంది జగన్ పద్ధతులు నచ్చక వైసీపీని వదిలేస్తున్నారన్నారు.తాము గెలిచినా, ఓడినా జనంకోసం బతికామని..జగన్‌లాగా ధనంకోసం బతకలేదని దుయ్యబట్టారు.

# వైసీపీ నేతల భూకబ్జాలకు అధికారుల అండ

- పోలీసులు తొత్తులుగా మారి సహకరించారు
- బాధితులపైనే ఎదురుకేసులు పెట్టి వేధించారు
- న్యాయం చేయాలని ప్రజావేదికకు అర్జీదారులు
- పెద్దిరెడ్డి అండతో భూములు కొట్టేసిన కజిన్ బ్రదర్
- దివ్యాంగుల స్థలాలు కొట్టేసి వ్యభిచారం నిర్వహణ
- వైసీపీలో చేరలేదని ఇంటికి వెళ్లే దారి మూసేశారు



మంగళగిరి(చైతన్యరథం): గత ప్రభుత్వంలో వైసీపీ నేతల భూకబ్జాలపై ప్రజావేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వారి భూకబ్జాలకు అధికారులు, పోలీసులు అండగా నిలిచి బాధితులపైనే అక్రమ కేసులు పెట్టిన వైనంపై న్యాయం చేయాలని నేతలకు ప్రజావేదికలో ఫిర్యాదులు చేస్తున్నారు. దివ్యాంగులకు కేటాయించిన స్థలాలను వైసీపీ నేతలు కబ్జాచేసి వ్యభిచారం నిర్వహిస్తుండగా కేసులు పెట్టినా నాడు పోలీసులు పట్టించుకోకపోగా తిరిగి తమపైనే అక్రమ కేసులు బనాయించి వేధించారని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన దివ్యాంగుల ఇంటి స్థలాలను ఇప్పించి తనపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని వినతిపత్రం ఇచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మంత్రి టీజీ భరత్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహ ప్రసాద్, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరాం చిన్నబాబులు అర్జీలు స్వీకరించారు.

- గత వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కజిన్ బ్రదర్ అయిన పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి అక్రమంగా తమ భూములను ఆక్రమించుకున్నారని.. తహసీల్దార్, వీఆర్వోలు వారికి సహకరించారని చిత్తూరుజిల్లా సదుం మండలానికి చెందిన కె.చోళేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించి తమ భూమిని ఇప్పించాలని, అక్రమార్కులకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుని భూ కబ్జా చేసిన పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- తాను టీడీపీ కార్యకర్తను కావడంతో వైసీపీలో చేరమంటే చేరలేదన్న కక్షతో తన ఇంటికి వెళ్లే దారిని రెండు వైపులా మూసివేశారని తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం ఇందిరానగర్‌కు చెందిన నూతలపాటి జయచంద్రనాయుడు ఫిర్యాదు చేశారు. అప్పటి అధికారులు కూడా వైసీపీ నేతలకే కొమ్ము కాశారని.. దారికి అడ్డంగా ఉన్న గోడలను తొలగించి దారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాడు.
- తన స్థలాన్ని వైసీపీ నేతలు కబ్జా చేయాలని చూశారని.. కోర్టుకు వెళుతుంటే దాడి చేశారని సత్యసాయి జిల్లా పెనుగొండ మండలం చంద్రగిరికి చెందిన జి.మధు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళితే సీఐ శ్రీహరి వైసీపీ నేతలకు తొత్తుగా వ్యవహరించి ఫిర్యాదును మార్చి రాసి బలవంతంగా తన చేత సంతకాలు చేయించారని వివరించారు.మరుసటిరోజు ఇచ్చిన ఫిర్యాదును వాపస్ తీసుకోవాలని సీఐ, ఎస్ఐ హరూన్‌బాషాలు బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లి వైసీపీ నేతలకు అనుకూలంగా అగ్రిమెంట్ తయారు చేయించి కోటిన్నర ఇవ్వాలంటూ బాండ్లపై సంతకాలు చేయించుకున్నారని వివరించారు.

తన ఇంటికి వచ్చి రూ.7లక్షల నగదు, రూ.31 లక్షల ప్రామిసరీ నోట్స్ తీసుకెళ్లారని.. దీనిపై నోరు తెరిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని నాడు బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు పోలీసు అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించి తన భూమిని కబ్జా చేయాలని చూసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

- గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో తమ భూమిని అక్రమంగా వీఆర్వోమరొకరి పేరుమీదకు మార్చారని ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం తెల్లబాడు గ్రామానికి చెందిన చలిచీమ శంకరావు తెలిపారు. కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా తనకు ఎటువంటి నోటీసుకూడా ఇవ్వకుండాఅక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకుని తనకు తన భూమిని ఇప్పించాలని వేడుకున్నారు.
- జద చక్రి,కె.మహేష్ అనువ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా తమ ఇంటిని కూల్చడమే కాకుండా రౌడీలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తిరుపతి మండలం తిరుపతికి చెందిన కె.సి.సునీత ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని.. వాళ్లకు అడ్డు వెళితే తలలు తీసేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదుచేసింది. తమకు ప్రాణ రక్షణ కల్పించి బెదిరింపులకు దిగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- నెల్లూరు జిల్లా కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి మూసివేతతో రోడ్డునపడ్డ దాదాపు 230 మంది కార్మికులు గ్రీవెన్స్‌లో తమ గోడు చెప్పుకున్నారు. షుగర్ ఫ్యాక్టరీ మూసివేతతో తామంతా రోడ్డున పడ్డామని.. 2019లో జగన్ రెడ్డికి తమ గోడు చెప్పుకోగా ఒక్కొక్కరికి రూ.10 లక్షలు పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని తెలిపారు. తమను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.
- తనను మోసం చేసి పెళ్లి చేసుకుని కాపురానికి పనికిరాని భర్త నుంచి విడాకులు అడుగుతుంటే తనను, తన తల్లిని చంపేస్తామని బెదిరిస్తున్నారని వారి నుంచి కాపాడి విడాకులు ఇప్పించాలని కృష్ణా జిల్లా గన్నవరం మండలం పురుషోత్తపట్నంకు చెందిన ఓ మహిళ వినతిపత్రం ఇచ్చింది.
- వినుకొండ మండలం గోకనకొండలో ఉన్న తన భూమిని వైసీపీ నేతలు ఆక్రమిం చుకున్నారని ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలానికి చెందిన వెంకటరామయ్య ఫిర్యాదు చేశారు. భూ కబ్జాపై రెవెన్యూ అధికారులను, పోలీసులను ఆదేశించి తమ భూములు ఇప్పించాలని వేడుకున్నారు.
- ఇంటికి కాంపౌండ్ గోడ కట్టుకోవడానికని లక్ష రూపాయలు పెట్టి తెచ్చుకున్న రాళ్లను దొంగిలించారని, ఇంటి పరిసరాల్లో పెరుగుతున్న చెట్లను నరికేసి తీసుకెళ్లారని కడప జిల్లా చెన్నూరు మండలం గుర్రంపాడు గ్రామానికి చెందిన మఠ్రి అరుణాదేవి ఫిర్యాదు చేసింది. దొంగలను పట్టుకుని చర్యలు తీసుకోవాలని కోరింది.
- ప్రకాశం జిల్లా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీకి చెందిన రిటైర్డ్, వీఆర్ఎస్ ఉద్యోగులు తమ సమస్యను వివరిస్తూ తమకు వివిధపద్దుల కింద కంపెనీ నుంచి పదవీ విరమణ ప్రయోజనాలు రావాల్సి ఉందని, దబ్బులు ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు.





# మంత్రి లోకేష్ గురించి మాట్లాడే అర్హత జగన్‌రెడ్డికి లేదు

- లేని దిశ చట్టం గురించి ఊకదంపుడు కబుర్లు
- గత ఐదేళ్లలో మహిళలపై 2 లక్షల అఘాయిత్యాలు
- తల్లి,చెల్లికే ద్రోహం చేసిన జగన్‌కు మహిళల రక్షణ గురించి మాట్లాడే హక్కు లేదు
- మంత్రి డోలా మండిపాటు



అమరావతి(చైతన్యరథం): ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా జగన్‌రెడ్డికి బుద్ధి రాలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. గురువారం అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాడేపల్లి, బెంగుళూరు ప్యాలెస్‌ల్లో తిరుగుతూ మంత్రి నారా లోకేష్‌పై జగన్ అవాకులు చెవాకులు పేలుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని దిశ చట్టం గురించి జగన్‌రెడ్డి మాట్లాడం హాస్యాస్పదంగా ఉంది. గత ఐదేళ్లు దిశచట్టానికి కేంద్రం నుంచి ఎందుకు ఆమోదం పొందలేదో జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. దిశ చట్టం ఉంటే రాష్ట్రంలో గత ఐదేళ్లలో మహిళలపై 2 లక్షల అఘాయిత్యాలు ఎందుకు జరిగాయి? ధన దాహంతో ఆస్తి కోసం తల్లి, చెల్లిపై కోర్టులో కేసు వేసిన జగన్‌రెడ్డికి మహిళల రక్షణ గురించి మాట్లాడే హక్కు లేదు. లోకేష్ మంగళగిరిలో పోటీ చేసి 90వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలిచారు. అతి తక్కువ సమయంలోనే 30వేల ఉద్యోగాలు రాష్ట్రానికి తీసుకొచ్చారు. విద్యాశాఖ మంత్రిగా 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. లోకేష్‌పై సాక్షిలో తప్పుడు రాతలు రాసినందుకు ఇవాళ కోర్టు మెట్లెక్కి తిరుగుతున్నా బుద్ధి రాలేదా? జగన్‌రెడ్డి పాలనలో జే ట్యాక్స్ దెబ్బకు రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు వెళ్లిపోయాయి. గుర్ల పర్యటనలో జగన్మోహన్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. అసలు ఈ పాపం నీది కాదా జగన్ రెడ్డీ? పంచాయితీ నిధులు రూ.13వేల కోట్లు దారి మళ్లించావు. అలాగే జలజీవన్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చి నిధులు దారి మళ్లించి రాష్ట్ర ప్రజలకు రక్షితనీరు ఇవ్వకుండా.. కలుషిత నీళ్లు తాగాల్సిన పరిస్థితి తీసుకొచ్చింది జగన్ రెడ్డి కాదా? మా ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. గత ఐదేళ్ల నీ పాలనలో పరదాలు కట్టుకొని తిరిగావు.

కూటమి పాలనలో స్వేచ్ఛగా తిరుగుతున్నావు. ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రతిపక్షనాయకుడిగా నీకు నువ్వే ప్రకటించుకుంటున్నావు. ఇంతకంటే సిగ్గుచేటైన విషయం ఉంటుందా? ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై జగన్మోహన్ రెడ్డి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడు. గత ఐదేళ్లు నీ పక్కన ఉన్న వైసీపీ నేతలే సంక్షేమం మాటున సంక్షోభం సృష్టించావని మాట్లాడుతున్నారు. దీనికి జగన్ ఏం సమాధానం చెబుతారని మంత్రి డోలా నిలదీశారు.

# ఉచిత ఇసుకకు కట్టుబడి ఉన్నాం

- ప్రజాప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యం
- అక్రమంగా రవాణాచేస్తే వాహనాలు సీజ్, పీడీ చట్ట ప్రయోగం
- స్పష్టం చేసిన మంత్రి కొలుసు పార్థసారథి



ఏలూరు / ముసునూరు (చైతన్యరథం): ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరాకు ప్రభుత్వం కట్టుబడివుందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖల మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. గురువారం ఏలూరు జిల్లా ముసునూరు మండలం వలసపల్లి, యల్లాపురంల్లో ఉచిత ఇసుక రీచ్‌లను ఆయన ప్రారంభించారు. తొలుత మంత్రి కొలుసు పార్థసారథికి నూజివీడు ఆర్డీవో ఎం వాణి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఐదేళ్ల పాటు ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేశారని,అంతటితో ఆగకుండా ఇసుక ధరలు పెంచి ప్రజలు, నిర్మాణదారులపై భారం మోపారన్నారు. ప్రజలకు ఇసుక కొనుగోలు భారం కాకూడదని, నిర్మాణ రంగానికి ఊతం ఇవ్వాలన్న ఆలోచనతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు కూటమి ప్రభుత్వం రాగానే ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చామన్నారు. జూలై నుంచి అధిక వర్షాలు, వరదలు మూలంగా నదుల్లో నీటి ప్రవాహం ఉండటంతో ఇసుక తీయడానికి ఆటంకాలు ఏర్పడి, కొంత కొరత ఏర్పడిందన్నారు. ఇసుక సరఫరాకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఇప్పుడున్న రీచ్‌లతోపాటు రాష్ట్రంలో మరో 108 కొత్త రీచ్‌లకు కూటమి ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. తద్వారా ఇసుకసరఫరా పెంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇసుక లభ్యతను మెరుగుపరచడానికి,అక్రమ రవాణాను నిరోధించి నిర్మాణరంగాన్ని ప్రోత్సహించేందుకు ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. సీనరేజ్,డిఎంఎఫ్, మెరిట్ ఫీజులకు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఫీజుల కింద వినియోగదారులు టన్నుకు రూ.88 చెల్లించాల్సి ఉండేదన్నారు. దీని మూలంగా ప్రభుత్వానికి రూ.265 కోట్లు ఆదాయం తగ్గినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు ఈనిర్ణయం తీసుకున్నారన్నారు.ప్రజలు ఎవరైనా తమ గృహనిర్మాణాలకు అవసరమైన ఇసుకను సొంతంగా లోడ్ చేసుకుని ట్రాక్టర్లతో తీసుకువెళ్లేందుకు అభ్యంతరం లేదన్నారు. అయితే స్థానికంగా ఎప్పటినుంచో ఇసుక లోడింగ్‌తో జీవనోపాధి పొందుతున్న కార్మికులు లోడింగ్ చార్జీల కోసం రూ.400 కోరుతున్నారన్నారు. లోడింగ్ చార్జి ఎంతమేర తగ్గించవచ్చో పరిశీలిస్తున్నామన్నారు. అదే విధంగా ట్రాక్టర్లు రవాణాచార్జి ఎక్కువ వసూలు చేస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దూరాన్ని బట్టి సబబైన ధర వసూలు చేయాలని, ఇష్టారాజ్యంగా వసూలు చేసేందుకు వీలులేదని మంత్రి స్పష్టం చేశారు. దీనిపై ట్రాక్టర్ల యజమానులు సమావేశమై ధర నిర్ణయించి వివరాలను సబ్ కలెక్టర్‌కు అందజేస్తే ఉప రవాణా కమిషనరు పరిశీలనకు పంపిస్తారన్నారు. అదే విధంగా ఇసుక రీచ్ వద్ద పర్యవేక్షణకు వీఆర్ఓ, సచివాలయ సిబ్బందిని నియమిస్తాన్నారు. రీచ్‌కు వచ్చే ట్రాక్టర్ నెంబరు, డ్రైవర్ పేరు, ఫోన్ నెంబరు,ఇసుక రవాణా చేస్తున్న భవన యజమాని వివరాలు నమోదు చేస్తారన్నారు.ఆవివరాలను సంబంధిత గ్రామాల్లో సచివాలయ సిబ్బందిచే నిర్ధారించుకుంటామన్నారు. అందులో ఏమైనా వ్యత్యాసాలు ఉంటే ఆ ట్రాక్టర్లను సీజ్ చేస్తారన్నారు.

ట్రాక్టర్లో ఇసుక తీసుకువెళ్లి లారీల్లో లోడింగ్ చేయడంవంటి అక్రమకార్యకలాపాలకు పాల్పడినా, అధిక ధరకు ఇసుకను విక్రయించినా అటువంటి వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలకు అవసరమైన ఇసుకను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిని ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉచిత ఇసుక విధానంపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. తొలుత ఇసుక లోడింగ్ చేస్తున్న కార్మికులతో లోడింగ్ చార్జీల విషయంపై మంత్రి పార్థసారథి చర్చించారు.

## త్వరలో సాధారణ స్థితికి మందుల సరఫరా



- గత ప్రభుత్వ బకాయిల చెల్లింపు, ప్రభుత్వాసుపత్రుల్లో మారనున్న పరిస్థితి
- మందుల కొరతపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష
- వివిధ ఆసుపత్రుల అవసరాల మేరకు సరఫరా విధానంలో మార్పులు చేయాలన్న మంత్రి
- స్థానిక అవసరాల మేరకు కొనుగోలు చేసుకునేలా ఆసుపత్రులకు అధికారాలు

అమరావతి(చైతన్యరథం):గత కొద్ది నెలలుగా వివిధ ప్రభుత్వాసుపత్రుల అవసరాల మేరకు మందులు, సర్జి కల్ పనిముట్లసరఫరా కాకపోవడంతో నెలకొన్న అందో ళనకు త్వరలో తెరపడనుంది. గత ప్రభుత్వం చివరి సంవత్సరంపాటు మందులు,పరికరాలు సరఫరా చేసిన వారికి బిల్లులు చెల్లించకపోవడంతో వారు సరఫరాను తగ్గించివేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో వీటికి కొరతఏర్పడింది. గత వైసీపీ ప్రభుత్వం సుమారు రూ.900 కోట్ల మేరకు చెల్లింపులు బకాయి పడడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ,వైద్యవిద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంనాడు సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించారు. మందులు, ఇతర పరికరాల సర ఫరాలో అంతరాయం ఏర్పడడానికి గల కారణాల్ని మంత్రికి అధికారులు వివరించారు. రాష్ట్రంలోని కూట మి ప్రభుత్వం ఇప్పటి వరకు మందులు, పరికరాలకు సంబంధించిన చేసిన వ్యయంపై మంత్రి ఆరా తీశారు. పరిస్థితి ఎప్పటికి మెరుగు పడుతుందని వాకబు చేశా రు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల పేరుకుపోయిన రూ.900 కోట్ల బకాయిల్లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం సగానికి పైగా చెల్లింపులు చేయడంతో, సరఫరాదారులు తిరిగి ముందుకొచ్చారని అధికారులు వివరించారు. బకాయిల చెల్లింపు గురించి ఆర్థికశాఖ అధికారులతో తాను కూడా చర్చించిన విషయాన్ని మంత్రి వివరించారు.

సమీక్ష సందర్భంగా మందుల సేకరణ, సరఫరా వ్యవస్థలో మార్పులుతెచ్చి యాంత్రిక విధానంలో కాకు ండా ఆయా ఆసుపత్రుల అవసరాల మేరకు సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. ఐదేళ్ల క్రితం రూపొందించిన ఎసెన్షియల్ సర్జికల్స్‌లిస్ట్‌ను సమీక్షించి కాలాను గుణంగా తగు మార్పుల్ని చేయాలని మంత్రి ఆదేశించారు. ఎముకలకు సంబంధించిన సమస్యలకు గురైన రోగులు ఎక్కువ స్థాయిలో ఇంప్లాంట్స్ కోరుకుంటున్నారని, వాటిని వివిధ ఆసుపత్రులకు ఏపీఎంఎస్ ఐడీసీ ద్వారా సరఫరా చేయించాలని వివిధ వైద్య శాఖాధిపతులు కోరగా, ఈ దిశగా తగు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

గతంలో ఏపీఎంఎస్ ఐడీసీ ద్వారా జరిగే సరఫరా కు అదనంగా అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అవసరాల మేరకు మందులు, సర్జికల్ పరికరాల్ని కొనుగోలు చేసు కొనే వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ సర్వజనాసుపత్రులు (జీజీహెచ్‌లు) తమకు కేటాయిం చిన బడ్జెట్లో 20శాతం మేరకు, ఇతర ఆసుపత్రులు 10 శాతం మేరకు కొనుగోళ్లు చేసుకోవచ్చు. ఈకొనుగోళ్లు ఆయా జిల్లాల కలెక్టర్ల అధ్వర్యంలోని కమిటీల ద్వారా జరుగుతాయి.

### ఏపీఎంఎస్ ఐడీసీ పనితీరుపై సమీక్ష

ఆంధ్రప్రదేశ్ మెడికల్‌సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ ఐడీసీ) పనితీరు ను కూడా గురువారం నాడు మంత్రి సమీక్షించారు. ఆరోగ్యశాఖకు పలుసేవలందించి తద్వారా వచ్చే అడ్మి నిస్ట్రేటివ్ ఫీజు ప్రధాన ఆదాయంగా ప్రభుత్వ బడ్జెట్‌పై ఆధారపడకుండా పనిచేస్తున్న ఈ సంస్థ గురించి ఆయన పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత కొన్నేళ్లుగా ఈ సంస్థ చేపట్టిన నిర్మాణాలు, మున్ముందు చేపట్టనున్న పనుల గురించి మంత్రి ఆరా తీశారు.

ఈ సంస్థ స్వయంచోదితంగా భవిష్యత్తులో పనిచే యడానికి రానున్న ఐదేళ్లలో ఇప్పటికే నిర్ధారితమై చేపట్టనున్న నిర్మాణ పనులు, అదనంగా దక్కనున్న అవకాశాలపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఆదేశించారు. సిబ్బందిపై ఈ సంస్థ నెలకు దాదాపు రూ.8కోట్లు వ్యయం చేస్తోంది. ఏపీఎంఎస్ ఐడీసీ మేనే జింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీషా, డిహెచ్ డాక్టర్ పద్మా వతి, డిఎంఇ అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

### తెలుగు రాష్ట్రాల ప్రైవేటు ట్రావెల్స్ అసోసియేషన్‌కు మంత్రి మండిపల్లి పిలుపు



విజయవాడ (చైతన్యరథం): ప్రతి నిత్యం రహదారులపై జరుగుతున్న రోడ్డుప్రమాదాల నివారణకు బస్సు యజమానులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు.విజయవాడశివారు రామవరప్పాడులోని కె.హెూటల్‌లో గురువారం నిర్వహించిన ఏపీ, తెలంగాణ ప్రైవేటు ట్రావెల్స్ అసోసియేషన్ పరిచయ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి మండిపల్లి హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సమస్యలు, నూతన విధివిధానాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు బస్సు యజమానులు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందితే కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. ఆ బాధ ఎలా ఉంటుందో తనకు తెలుసునంటూ, తన చిన్నతనంలోనే తన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలిపారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు హెూమ్, హెల్త్, రవాణా శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. రవాణాశాఖ సాఫ్ట్‌వేర్‌లో ఉన్న ఇబ్బందులను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో టాక్స్‌ల తగ్గింపు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకి పరిస్థితిని వివరిస్తామని, ప్రభుత్వ శాఖలకు ఆదాయం లేకపోతే మెరుగైన సేవలు అందించలేమన్నారు.అధికారుల వల్ల ఇబ్బందులు ఉంటే నేరుగా తనను సంప్రదించడానికి అసోసియేషన్ కార్యవర్గానికి సూచించారు.చంద్రబాబు ప్రభుత్వం ఫ్రెండ్లీ పరిపాలన అందిస్తోందని, ప్రైవేటు ట్రావెల్స్ సమస్యలను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. అధికారులు వ్యక్తిగత కక్షల కారణంగా చేసే కొన్ని పనులను ప్రభుత్వాన్ని ఆపాదించవద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బస్సుయజమానుల శ్రేయస్సు కోసం పలు చర్యలు తీసుకున్నారన్నారు. టూ ప్లస్ వన్ స్లీపర్ బస్సులను రిజిస్ట్రేషన్ చేసి ఆల్ ఇండియా పర్మిట్‌కి అవకాశం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. బస్సు యజమానులు అందరూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అనంతరం మంత్రిని అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

# గుర్లలో డయేరియాపై హోంమంత్రి సమీక్ష



విజయనగరం(చైతన్యరథం): కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో రాష్ట్ర హోంమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. విజయనగరం ఎంపీ, ఐటీ కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. సమీక్షలో గుర్ల గ్రామంలో వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, శుభ్రత, తాగు నీటి సరఫరా, ఆరోగ్య సంరక్షణ పథకాల గురించి విస్తృతంగా చర్చించారు. జిల్లా అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. వైద్య అధికారులు ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సమయానికి అందించాలని, అవసరమైన మందులు, నీటిశుద్ధి పథకాలను వేగంగా అమలు చేసేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎంపీ కలిశెట్టి సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకట రావు,నడుకుదిటి ఈశ్వర్‌రావు, కోళ్ల లలిత కుమారి, అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి, కొండ్రు మురళీమోహన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, విజయనగరం పార్లమెంట్ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, చీపురుపల్లి మాజీ ఇన్‌చార్జి త్రిమూర్తులు రాజు, జిల్లా ఎస్పీ, ముఖ్య పోలీసు అధికారులు, జిల్లా వైద్యాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్త్రీశిశు సంక్షేమంపై మంత్రి సంధ్యారాణి సమీక్ష

అమరావతి(చైతన్యరథం): అమరావతి సచివాలయంలో గురువారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధ్యక్షతన మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖపై సమీక్ష సమావేశం జరిగింది. 26 జిల్లాల ఐసీడీఎస్ పీడీలు, ఆర్‌జేడీలు హాజరయ్యారు. రాష్ట్రంలో అత్యాచారాలు, పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించాలన్నారు. అంగనవాడీ సెంటర్లకు తాగునీరు, మరుగుదొడ్ల నిమిత్తం రూ.52 కోట్లు మంజూరు అయినట్టు చెప్పారు. బాల్య వివాహాలు నివారించాలని, బాలకార్మికుల భిక్షాటనను అరికట్టి చైల్డ్ హోంలో పెట్టి చదివించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న 55 వేల అంగన్‌వాడీల్లో హెల్ప్‌లైన్ నెంబర్, పోలీసు నెంబర్ తప్పక ఏర్పాటు చేయాలని సూచించారు.






త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరచిన ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్ పరిచయ కార్యక్రమం ఈనెల 27వ తేదిన బెంగళూరులో నిర్వహించనున్నట్లుపార్టీ వర్గాలు వెల్లడించాయి. బెంగళూరులో నివాసం ఉంటున్న ఉమ్మడి కృష్ణ-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రులందరు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని కోరుతూ గురువారం ప్రకటనలో కోరారు.

# జగన్‌రెడ్డి పాపం...
# ప్రజారోగ్యానికి శాపం!



జలజీవన్‌ను, తాగునీటి నిర్వహణను గాలికొదిలి నిధులు బొక్కేసి స్థానిక నిధులను దారి మళ్లించి నీటి వనరులను, పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేసి ప్రజారోగ్య వ్యవస్థను కుప్పకూల్చి ప్రాణాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డి అండ్ కో చేసిన పాపాలు రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయి. అవినీతి కంపుతో కుళ్లిపోయి శవరాజకీయాలతో రగిలిపోతున్న ఆయన మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్టుంది. ఐదేళ్లపాలనలో గ్రామ పంచాయతీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు. జలజీవన్ మిషన్ కింద కేంద్రం ఇచ్చే నిధులకు ఐదేళ్ల పాటు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీల నిధులను దారిమళ్లించి గ్రామాల జవజీవాలను కృంగదీశాడు. పారిశుధ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యంచేసి గ్రామాలను మురికి కూపాలుగా మార్చాడు. అనక ఇప్పుడు డయేరియా మృతుల కుటుంబాలకు పరామర్శల పేరిట శవరాజకీయాలకు వాలిపోయాడు.

### గుక్కెడు నీరు అందించడంలోనూ అవినీతే

సురక్షిత తాగునీరు ప్రజలప్రాథమిక హక్కు. అలాంటి హక్కుని కూడా హరించేసి దుర్మార్గపు పాలనతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాడు జగన్‌రెడ్డి. మున్సిపాలిటీ, పంచాయతీలకు చెందిన రూ.14వేల కోట్లు దారిమళ్లించడంపై ఉన్న శ్రద్ధ వాటర్‌ట్యాంకుల క్లీనింగ్‌పై లేదు. గ్రామాలకు సరఫరా చేసే తాగునీటి పంప్ హౌస్‌లకు కనీసం ఫిల్టర్ బెడ్లు కూడా మార్చకుండా క్లోరినేషన్ చేపట్టకుండా ఆనిధులను సైతం బొక్కేయడమే ఈదుస్థితికి కారణం. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు తాగునీటి పైపులైన్ల నిర్వహణను గాలికొది లేయడంతో అనేక చోట్ల మురుగునీటిలోనే తాగునీటి పైపు లైన్లు కలిసినీరు కలుషితమవుతుంది. జగన్‌రెడ్డి హయాంలో కుప్పకూలిన ప్రజారోగ్య వ్యవస్థను కూటమి ప్రభుత్వం సరిచేస్తుంది. ఈలోగా ఎక్కడైనా ఒకటి రెండు దురదృష్టకర సంఘటనలు జరిగితే పార్ట్‌టైం పొలిటీషియన్ జగన్‌రెడ్డి బెంగళూరు ప్యాలెస్ నుంచి వాలిపోయి శవ రాజకీయాలుచేస్తూ కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఆరాటపడి పోతున్నాడు. తనఇంటి చుట్టూ ఫెన్సింగ్‌కు రూ.12 కోట్లు, రిషికొండ ప్యాలెస్‌కోసం రూ.500కోట్లు ఖర్చు పెట్టిన జగన్‌రెడ్డికి గ్రామాలలో ప్రజలకు గుక్కెడు మంచి నీళ్లిచ్చేందుకు చేతులురాక పోవడం దుర్మార్గం. తన హయాంలో రాష్ట్రంలో అనేకచోట్ల కలుషిత తాగు నీటితో ప్రజలు అతిసార బారినపడి పిట్టల్లా రాలిపోతే "రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు" తాడేపల్లి ప్యాలెస్‌లో పబ్జీ ఆడుకున్న జగన్‌రెడ్డి ఈరోజు శవ రాజకీయం చేయడానికి డయేరియా బాధితులపై కపట ప్రేమ ఒలకబోస్తున్నాడు. ప్రజల ప్రాణాలపై అంత శ్రద్ధ ఉంటే రాష్ట్ర ప్రజలకు ఈ దుస్థితి వచ్చేది కాదు.

### ఒక్క కుటుంబాన్ని అయినా పరామర్శించారా?

జగన్‌రెడ్డి హయాంలో చిత్తూరు జిల్లాలో గంగాధర నెల్లూరు మండలం కడపగుంటలో కలుషిత నీరు తాగ డంతో అతిసారకు ముగ్గురు చనిపోయి వందల మంది ఆసుపత్రి పాలయ్యారు. కర్నూలు జిల్లా గోరుకల్లులో అతిసారతో ఐదుగురు చనిపోగా 200మంది ఆస్పత్రి పాలయ్యారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాళెం మండ లంలోని పల్లాప్రోలులో ఐదుగురు చనిపోగా 50 మంది ఆస్పత్రి పాలయ్యారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం తెంపల్లి గ్రామంలో ఐదుగురు మృత్యువాతపడగా 115 మంది ఆస్పత్రి పాలయ్యారు. చిత్తూరుజిల్లా గంగా ధర నెల్లూరు మండలం కడప గుంటలో ముగ్గురు చనిపోగా 80 మంది ఆస్పత్రి పాలయ్యారు.గుంటూరులో డయేరియాతో 10మందికి పైగా చనిపోయారు. జగన్‌రెడ్డి వాసి రకం మద్యం తాగి గత ఐదేళ్లలో 2లక్షల మంది ఆస్పత్రుల పాలు కాగా, 30వేల మంది చనిపోయారు. కల్తీ మద్యం, నాటుసారా తాగి పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డి గూడెంలో వారం వ్యవధిలోనే 26 మంది చనిపోయారు. విశాఖ, గుంటూరు, ఏలూరు, కర్నూలు ఇలా ప్రతిజిల్లాలోనూ కల్తీ మద్యం మరణాలు సంభవించాయి. నాడు నేడు కింద వైద్యరంగానికి రూ.16,000 కోట్లు ఖర్చు పెడుతున్నామని.. ఏపీలో ఆరోగ్య విప్లవం తీసుకొస్తామని ఐదేళ్లు పాడిన పాటే పాడిన జగన్‌రెడ్డి ఆచరణలో చేసిందేమీ లేదు. ఐదేళ్ల పాలనలో అన్ని మరణాలు, లక్షలాది మంది ఆస్పత్రుల పాలయితే ఒక్కరి నైనా పరామర్శించలేదు. తాగునీరు కలుషితమై ప్రజల ప్రాణాలు పోతుంటే అవేమీ పట్టని జగన్‌రెడ్డి ఐదేళ్ల పాటు స్కామ్‌లు చేసుకుంటూ డబ్బు పోగేసుకోవడం దుర్మార్గం కాదా?

### ప్రజారోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం కృషి

జగన్‌రెడ్డి నాశనం చేసిన ప్రజారోగ్య వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా ప్రబలడాన్ని కూటమి ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. 120 మంది వైద్య సిబ్బందితో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. ట్యాంకర్ల ద్వారా అన్ని గ్రామాలకు రక్షిత తాగునీటిని సరఫరా చేస్తుంది. ప్రత్యేక విచారణాధికారితో కూడిన టీంను పంపించి వ్యాధి ప్రబలడానికి కారణాలేంటో సమగ్ర విచారణ చేయించింది. నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటుంది. కూటమి ప్రభుత్వ కృషితో జలజీవన్ మిషన్ పనుల కోసం రూ.580కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను ప్రజలకు రక్షిత మంచి నీరందించేందుకు పూర్తిస్థాయిలో వినియోగించనుంది.

- సౌజన్య బొర్రా,
అనలిస్ట్

# స్వర్ణాంధ్ర సాకారానికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ కీలకం

**- ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మరింత పటిష్టంగా కృషి చేయాలి**

**- ఆరోగ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కోసం ప్రచారోద్యమం**

**- వైద్య సిబ్బందికి మంత్రి సత్యకుమార్ ఆదేశం**

**- గుర్లలో డయేరియాపై ఆర్ఆర్టీ నివేదికపై మంత్రి సమీక్ష**

అమరావతి (చైతన్యరథం): ప్రగతి పథంలో పరుగులిడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణ లక్ష్య సాధనలో రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటం అత్యంత కీలకమని, ఇది అందరి తక్షణ కర్తవ్యమని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖల మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. నైపుణ్యతతో కూడిన మానవ వనరుల్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుని తద్వారా వచ్చే ఆర్థిక ప్రగతితో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాకారం చేసుకోడానికి ప్రజలు తరచుగా అనారోగ్యంపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ, ప్రయివేట్ వైద్య సిబ్బంది, ఆసుపత్రులపై ఉందన్నారు. గుర్లలో డయేరియా వ్యాధి ప్రబలటంపై ఆరుగురు వైద్య నిపుణులతో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ ఆర్టీ) అందించిన నివేదికలోని పలు అంశాలు, సూచనలను మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం రెండు గంటలకు పైగా నిశితంగా సమీక్షించారు.

గుర్లలో డయేరియా కేసులు నమోదైన తేదీలు, ప్రభుత్వ వైద్య సిబ్బంది చేపట్టిన చర్యలు, వ్యాధిని అదుపులోకి తెచ్చిన వైనంపై సంబంధిత అధికారులకు మంత్రి పలు ప్రశ్నలు సంధించారు. పరిశుభ్రమైన తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయాలకు సంబంధించి సంబంధిత శాఖలతో క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సమన్వయం చేసిన తీరును కూడా తెలుసుకున్నారు. వ్యాధిని అరికట్టడానికి వైద్య సిబ్బంది ఆశించిన స్థాయిలో కృషి చేశారా.. లేదా అని మంత్రి వివరాలు తెలుసుకున్నారు. గుర్ల అనుభవాల నుంచి ఎటువంటి పాఠాలు నేర్చుకున్నారు ...అలాంటి పరిస్థితులు పునరావృతమైతే సిబ్బందిలో మరింత మెరుగైన సన్నద్ధతపై




మంత్రి సత్యకుమార్ సమీక్షించారు.

గుర్లలో డయేరియా వ్యాధి ప్రబలడానికి దారితీసిన పరిస్థితులు, వైద్య శాఖ అందించిన సేవల్ని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కె.పద్మావతి వివరించారు. మొత్తం 120 మంది వైద్య సిబ్బందిని గుర్లలో మూడు షిఫ్టుల్లో నియమించి దాదాపు 200 మంది ప్రాణాల్ని కాపాడగలిగామని ఆమె తెలిపారు. ఈ దిశగా వైద్య సిబ్బంది కృషిని మెచ్చుకున్న మంత్రి ఇలాంటి ప్రతి అనుభవంతో మున్ముందు రానున్న సవాళ్లను మరింత పటిష్టంగా అధిగమించాలని సూచించారు.

పారిశుధ్యం, నిత్య జీవితంలో ఆచరించాల్సిన ఆరోగ్యకరమైన పద్ధతులు, అలవాట్ల పట్ల ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం పట్ల మంత్రి సత్యకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దిశగా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడానికి ప్రభావవంతమైన ప్రచారోద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. అనారోగ్యం వల్ల కలిగే అరిష్టాలు, ఆరోగ్యంతో వచ్చే ప్రయోజనాల పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు.

గుర్లలో ఎదురైన పరిస్థితులు పునరావృతం కాకుండా చూసేందుకు సుదీర్ఘమైన చర్చల అనంతరం మంత్రి పలు ఆదేశాలిచ్చారు....

1) ప్రజల వ్యక్తిగత ఆరోగ్యంతో కూడిన ఆరోగ్యాంధ్రప్రదేశ్ అవసరం పట్ల ప్రజల్లో తగు చైతన్యాన్ని కల్పించడానికి వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని చేపట్టాలి
2) ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న ఇతర ప్రభుత్వ శాఖలతో పటిష్టమైన సమన్వయం చేసుకోవాలి
3) స్థానిక పంచాయతీ, పురపాలక, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ అధికారులతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్టీ) లు ఏర్పాటు చేయాలి
4) వ్యాధుల నివారణ, అనంతర నియంత్రణ చర్యలపై ఆర్ఆర్టీలు వర్షా కాలంలో 15 రోజులకోసారి, ఇతర సమయాల్లో నెలకోసారి సమావేశమై చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, తగు విధంగా చర్యలు చేపట్టాలి
5) సాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థల్ని కలుషితం చేసే మార్గాల్ని గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం ద్వారా కాలుష్యాన్ని నివారించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలి
6) వివిధ వ్యాధులకు సంబంధించి చూచాయగా కేసులు బయటపడిన వెంటనే ప్రభుత్వ వైద్య సిబ్బంది రంగంలోకి దిగి వ్యాధి ప్రబలకుండా అరికట్టడానికి చర్యలు చేపట్టాలి
7) బాధిత రోగులందరికీ వైద్య ప్రోటోకాల్ మేరకు చికిత్స అందించేందుకు సంబంధిత ఆసుపత్రుల భాగస్వామ్యంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి
8) వ్యాధికి గురైన వారిని గుర్తించి వారితో ఇతరుల సంపర్కాన్ని అరికట్టి వ్యాధి ప్రబలకుండా చర్యలు చేపట్టాలి
9) తరచుగా తాగునీటి పరీక్షలు చేయించి, నీటి నాణ్యతను గుర్తించి అవసరం మేరకు తగు చర్యలు చేపట్టాలి
10) వ్యాధి ప్రబలే సంకేతాలు వచ్చినప్పుడు ఆయా ప్రాంతాల్లో వివిధ మార్గాల ద్వారా ప్రజలకు తెలియజేసి హెచ్చరికలు జారీ చేయాలి

## నేటి నుండి జాతీయస్థాయిలో పశుగణన

**- రాష్ట్రంలో ఏర్పాట్లు పూర్తి**

**- వచ్చే ఫిబ్రవరి 28 వరకు నిర్వహణ**



అమరావతి (చైతన్యరథం): దేశ వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీ నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు 21వ అఖిల భారత పశుగణన చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శి ఎంఎం నాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం అన్ని జిల్లాల పశుసంవర్ధక శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అఖిల భారత పశుగణన నిర్వహణపై సలహాలు, సూచనలు అందించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మన రాష్ట్రంలో మొత్తం 1.50 కోట్ల కుటుంబాలకు సంబంధించిన పశువుల వివరాలను నమోదు చేయాల్సి ఉందన్నారు. వివరాల సేకరణకు పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది పశు పోషకుల ఇళ్ల వద్దకు వస్తారన్నారు. ఆ సమయంలో తమ వద్ద ఉన్న పశువులు, కోళ్ళ సంఖ్యపై సరైన సమాచారాన్ని పెంపకందారులు అందించాల న్నారు. గణన ప్రక్రియ పూర్తయిన తరువాత అందుకు గుర్తుగా ప్రతి ఇంటి ముందు తలుపు కుడి పక్కన పై భాగంలో స్టిక్కర్లు అతికిస్తారని తెలిపారు.

భవిష్యత్ ప్రణాళిక, విధాన రూపకల్పనకు పశుగణన కీలకమైన సమాచారాన్ని అందిస్తుందన్నారు. ఇది పశుసంవర్ధక రంగానికి, రాష్ట్రంలో పశు సంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా కార్యక్రమాలు సమర్ధవంతంగా రూపొందించడానికి దోహదపడు తుందన్నారు. గ్రామీణ భారతదేశంలో పశువుల పెంపకం కీలకమైన ఆర్థిక వనరు అని, అంతే కాకుండా ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు పశు పోషణ అదనపు ఆదాయాన్ని అందిస్తుందన్నారు. అనేక భూమిలేని కుటుంబాలకు ప్రాథమిక జీవనోపాధిగా పని చేస్తుందన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, సంక్షోభ సమయాల్లో గ్రామీణ ప్రాంతాలలో పశుపోషణ కీలకమైన ఆదాయ వనరుగా ఉంటుందన్నారు..

పశుగణన ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారన్నారు. పశు సంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించిన కార్యక్రమాల ప్రణాళిక రూపకల్పన, అమలు, పర్యవేక్షణ కోసం అవసరమైన సమాచారం అందిస్తుందన్నారు. పశుగణన మొదటి సారిగా 1919 - 1920వ సంవత్సరంలో నిర్వహించారన్నారు. అప్పటి నుండి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 20 పశుగణనలు నిర్వహించారన్నారు. 21వ పశుగణన ఈ నెల 25న ప్రారంభం కానుందన్నారు. ఈ పశు గణన ద్వారా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, వివిధ రకాల కోళ్ళు, పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సేకరిస్తారన్నారు.

నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్డీడీబీ) భాగస్వామ్యంతో భారత ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఆండ్రాయిడ్ అప్లికేషన్‌ను ఉపయోగించి ఈ పశుగణన ఆన్‌లైన్ లో నిర్వహిస్తారన్నారు.. ఆంధ్రప్రదేశ్ పశుగణనలో 5,390 మంది విషయ సేకరణదారులు, 1,237 మంది సూపర్ వైజర్లు, 45 మంది స్క్రూటినీ ఆఫీసర్లు మరియు ఇతర ఫీల్డ్ సిబ్బంది ఉంటారన్నారు. 21,173 గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో (17,244 గ్రామీణ గ్రామాలు, 3,929 పట్టణ వార్డులు) సమాచారం సేకరిస్తారన్నారు. టీవీ ఛానెళ్లలో స్క్రోలింగ్ సందేశాలతో సహా ప్రజలకు అవగాహన కల్పించే ప్రచారం శుక్రవారం నుండి ప్రారంభిస్తారని ఎంఎం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వపరంగా చేయూత ఇవ్వాలి

**- మంత్రి మండిపల్లికి అంతర్జాతీయ క్రీడాకారుడు శ్రీనివాసరావు వినతి**



విజయవాడ (చైతన్యరథం): ఉద్యోగపరంగా ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించి క్రీడారంగంలో మరింతగా రాణించేందుకు చేయూత ఇవ్వాలని పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్, అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 75 పతకాలు సాధించిన కాకినాడ జిల్లాకు చెందిన క్రీడాకారుడు మందపల్లి శ్రీనివాసరావు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రిని కలిసిన శ్రీనివాసరావు సమస్యను విన్నవించుకున్నారు. తను గత 24 సంవత్సరాలుగా ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నానని, కాగా తాను వివిధ పోటీల్లో పాల్గొంటూ విధులకు రాలేకపోవటంతో తనకు రావలసిన ప్రమోషన్లు, జీతాలు నిలిపివేస్తున్నారని మంత్రికి విన్నవించారు. ప్రభుత్వ పరంగా సహాయం చేసి క్రీడల్లో రాణించడానికి చేయూత అందించాలని మంత్రిని కోరారు. స్థానికంగా యువతకు శిక్షణ ఇచ్చేందుకు జిమ్ ఏర్పాటు చేయడానికి తగిన తోడ్పాటు అందివ్వాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి శ్రీనివాస్‌కు తగిన సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ అనురాధ బాధ్యతల స్వీకరణ



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఛైర్‌పర్సన్‌గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి అనురాధ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ బందర్ రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలోని ఛాంబర్‌లో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆమెతో ఏపీపీఎస్సీ కార్యదర్శి జే ప్రదీప్ కుమార్ పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఏపీపీఎస్సీలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న నియామకాలపై బోర్డు సభ్యులు, అధికారులతో అనురాధ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రూప్-1, గ్రూప్-2తో పాటు నిర్వహించాల్సిన పలు నియామక పరీక్షలు, ఇంటర్వ్యూలపై ఛైర్‌పర్సన్ ఆరా తీశారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమితులైన ఐపీఎస్ అధికారి గౌతమ్ సవాంగ్ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా అనంతరం ఈ పదవి ఖాళీగానే ఉంది. తాజాగా అనురాధను ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, అనురాధ గతంలో ఇంటెలిజెన్స్ చీఫ్, హోంశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.

***అభినందనలు తెలిపిన విజయవాడ సీపీ***

ఏపీపీఎస్సీ నూతన ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి అనురాధను విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించిన కమిషనర్ అభినందనలు తెలియజేశారు.

## అమరావతికి కొత్త రైల్వేలైన్ మంజూరు హర్షణీయం

***- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ***



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం కొత్త రైల్వేలైన్ మంజూరు చేయటాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. ఎర్రుపాలెం నుండి నంబూరు వరకు అమరావతి మీదుగా 57 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటు హర్షణీయమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి, అభివృద్ధికి రైల్వే లైన్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను అనుసంధానించడం వల్ల ఏపీకి వాణిజ్య సంబంధాలు మెరుగుపడతాయన్నారు. తద్వారా రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

# జలజీవన్ మిషన్ పథకం ద్వారా త్వరలో ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్

◆ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడి

◆దుందిరాలపాడులో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

◆ఎంపి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు



తిరువూరు (చైతన్యరథం): జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, దుందిరాలపాడులోని రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ వ్యాఖ్యానించారు. తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం దుందిరాలపాడు గ్రామంలో తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావుతో కలిసి ఎంపి కేశినేని శివనాథ్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి కి దుందిరాల పాడు గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఎంపి గా కేశినేని శివనాథ్ గెలిచిన తర్వాత మొదటిసారిగా దుందిరాలపాడు రావటంతో ఆ గ్రామంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్ల సమస్యలనీ పరిష్కరించాలని గ్రామప్రజలు కోరగా ఎంపి కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ గ్రామలనుద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని వివరించారు. దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల సమస్యలను మండలాల వారిగా అధికారులతో పాటు ప్రజలతో చర్చించి సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు తను ఎప్పుడు అందుబాటులో వుంటానని, ఏసీ రూమ్ లో కూర్చొని వ్యక్తిని కాదని...ప్రజల మధ్య వుంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు.

అనంతరం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... దుందిరాల పాడులో రోడ్ల సమస్యలనే కాదు..తిరువూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎంపి సహకారంతో పూర్తిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు, గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షులు రేగళ్ల వీరారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, గంపలగూడెం తెలుగు యువత అధ్యక్షులు మానికొండ రామకృష్ణ, టీడీపీ నాయకులు తన్నీరు అజయ్, బూరుగు నారాయణలతో పాటుగా ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి

◆ఎమ్మెల్యేను కలిసిన బోర్డు తిప్పేసిన సాఫ్ట్ వేర్ కంపెనీ బాధితులు

గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం గుంటూరు అరండల్ పేటలో ఇటీవల ఉద్యోగాల పేరుతో ఓ సాఫ్ట్ వేర్ సంస్థ తమ వద్ద నుండి లక్షల్లో వసూలు చేసి మోసం చేసిందని, తమకు న్యాయం చేయాలంటూ బాధితులు గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలిసి వద్ద తమ గోడును వెళ్ళబోసుకున్నారు. నిరుద్యోగ యువత అయిన తాము వివిధ రాష్ట్ర వాసులమన్నారు. ఉద్యోగం కల్పిస్తామని ఓ ఐ.టీ సొల్యూషన్ కంపెని నిర్వాహకులు తమ నుండి లక్షన్నర నుండి ఆరు లక్షల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేశారన్నారు. సంస్థ నిర్వాహకుడిపై చర్యలు తీసుకొని తమ డబ్బులు వెనక్కి ఇప్పించి, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరగా, ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పందిస్తూ...ఈ విషయము తన దృష్టికి వచ్చిందని, దీనిపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడానని, నిందితులు ఎంతటి వారైనా ఖచ్చితంగా అరెస్టు చేసి శిక్షించాలని పోలీసులకు సూచించినట్లు, ఎస్పీ దృష్టికి కుడా ఈ విషయాన్ని తీసుకెళ్ళి, బాధితులందరికీ న్యాయం చేస్తానని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.

## పుట్టపర్తిలో చెరువులకు జలకళ

◆మరువ పారుతున్న ఎనుమలపల్లి చెరువు

◆గంగ పూజ చేసిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

పుట్టపర్తి (చైతన్యరథం): ఇటీవల భారీ వర్షాలకు పుట్టపర్తి నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో చెరువులకు భారీ నీరు చేరి కళకళలాడుతున్నాయి. గురువారం పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో ఉన్న ఎనుములపల్లి చెరువు మరవ పారుతుండడంతో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అక్కడ గంగపూజ చేశారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లోని చెరువులకు భారీగా వర్షపు నీరు చేరి నీటితో చెరువులన్నీ కలకలాడుతున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షాలు పిల్లలకు కురవడంతో సాగునీరు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని మాజీ మంత్రి పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు మాసాల్లో గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమం కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుతం వరుణదేవుడు కరుణించడంతో రైతాంగంలో ఉత్సాహం నెలకొందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి తో పాటు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బీజేపీ, జనసేన తదితర నాయకులు పాల్గొన్నారు.



## రీ సర్వేలో తప్పులు సరిదిద్దటానికే రెవిన్యూ గ్రామ సభలు

◆సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు 'ఆళ్ళ'

◆రంగన్నగూడెంలో జరిగిన రీసర్వే రెవిన్యూ గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రైతులు



గన్నవరం (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టు, రీసర్వేలో జరిగిన ఘోరమైన తప్పులను సరిదిద్దటానికే ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవిన్యూ శాఖ ద్వారా గ్రామ సభలు నిర్వహిస్తోందని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిశదశ నిర్దేశంతో రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో రీసర్వే పూర్తైన గ్రామాల్లో గ్రామసభల్లో భాగంగా గురువారం సాయంత్రం రంగన్నగూడెంలోని కమ్యూనిటీ హాల్ లో గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి అధ్యక్షతన రెవిన్యూ గ్రామసభను నిర్వహించి రైతుల దగ్గరనుంచి సూచనలు, సలహాలు, వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ ప్రముఖులు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ... కృష్ణాజిల్లాలో రీసర్వే పూర్తయిన 21 మండలాల్లో 290 గ్రామాలకు సంబంధించి తప్పులు సరిదిద్దటానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ రెవిన్యూ గ్రామసభలను నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా రంగన్నగూడెం గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వంలో మొత్తం 1,615 ఎకరాల గుడికట్టు ఉండగా 1,400 ఎకరాలు తప్పులు దొర్లగా రైతుల ఆందోళన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 90శాతం తప్పులను సరిదిద్దారని ఇంకనూ 100 ఎకరాలకు సంబంధించి రీసర్వేలో దొర్లిన తప్పులను సరిదిద్దాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో 1999 లో జన్మభూమి పథకంద్వారా రైతులు పట్టా భూములు విడగొట్టి గ్రామపంచాయితీకి రిజిష్టరు చేసి 5 లింకు రోడ్లు ఏర్పాటు చేసుకున్నారని ప్రస్తుతం రీసర్వే తరువాత ఈ రోడ్లను కూడా ఎఫ్.ఎం.బి లో రైతుల పట్టా భూముల్లో కలిపి చూపించారని, వీటిని డీమార్క్ చేసి ప్రత్యేక ఎల్.పి నెంబర్లు కేటాయించి రాబోయే 50 సంవత్సరాలలో భవిష్యత్తు తరాల అవసరాలకు శాశ్వతంగా ఎఫ్.ఎం.బి మ్యాప్ లు ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామంలో గ్రామ పంచాయితీ కార్యాలయం, గ్రామ సచివాలయం, కమ్యూనిటీ హాలు, పి.ఏ.సి.ఎస్, ఇతర ప్రభుత్వ స్థలాలను డీమార్క్ చేసి ఎల్.పి నెంబర్లు కేటాయించాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

## బ్రాహ్మణులకు పూర్వ వైభవం తేవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

◆వైసీపీ పాలనలో అన్యాయానికి గురైన బ్రాహ్మణ వర్గం

◆గుంటూరు కొత్తపేటలోని యడవల్లి వారి బ్రాహ్మణ సత్రాన్ని సందర్శించిన మంత్రి సవిత

◆కూటమి ప్రభుత్వంతోనే బ్రాహ్మణులకు పూర్వవైభవం : శిరిపురపు శ్రీధర్ శర్మ



గుంటూరు (చైతన్యరథం): బ్రాహ్మణులకు పూర్వ వైభవం తేవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ పాలనలో అన్యాయానికి గురైన బ్రాహ్మణ వర్గానికి మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత వ్యాఖ్యానించారు. గురువారం గుంటూరులో పర్యటించిన ఆమె కొత్తపేటలోని యడవల్లి వారి బ్రాహ్మణ సత్రాన్ని సందర్శించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యడవల్లి వారి బ్రాహ్మణ సత్రానికి చెందిన మూడు ఎకరాల స్థలాన్ని పరిశీలించి రాబోయే రోజుల్లో ఆ భూమిని బ్రాహ్మణుల సంక్షేమం కోసం మాత్రమే వినియోగించేలా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా పేద బ్రాహ్మణ కుటుంబాలకు లబ్ధి చేకూరేలా చేశారని, గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బడ్జెట్ కేటాయించకుండా బ్రాహ్మణుల సంక్షేమాన్ని కూడా మోసం చేశారని మండిపడ్డారు.

అనంతరం బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కోఆర్డినేటర్, సత్రం మాజీ కన్వీనర్ సిరిపురం శ్రీధర్ శర్మ మాట్లాడుతూ... వైసీపీ పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్ పూర్తిగా భ్రష్టుపట్టిందన్నారు. అర్చకులపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడినా ముఖ్యమంత్రిగా జగన్ ఏనాడు పట్టించుకోలేదన్నారు. అర్చకులు సమస్యలు పరిష్కరించ కుండా తత్సర్యం చేశారని, చంద్రబాబు ప్రభుత్వం రాగానే అర్చకులకు వేతనం రూ.15,000లకు పెంచడంతో పాటు, ధూప దీప నైవేద్యాల పథకం కింద రూ.10,000లు ఇవ్వడం జరిగిందన్నారు. ట్రస్ట్ బోర్డులో బ్రాహ్మణులకు కూడా అవకాశం కల్పిస్తున్నారని, బ్రాహ్మణులు కోల్పోయిన పూర్వవైభవాన్ని తిరిగి కూటమి ప్రభుత్వంలో తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. యడవల్లి వారి బ్రాహ్మణ సత్రాన్ని అభివృద్ధి చేయడం, బ్రాహ్మణ సంక్షేమానికి వినియోగించడం, న్యాయపరమైన వివాదాలు పరిష్కరించడం కోసం కృషి చేస్తున్న మంత్రి ఎస్.సవితకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని శ్రీధర్‌శర్మ పేర్కొన్నారు. అనంతరం మంత్రిని దుశ్శాలువాతో సత్కరించారు.

